దేశంలోనే టాప్ 10

చిత్తూరు-నెల్లూరు ఇండస్ట్రియల్ కారిడార్



● వెల్లడించిన తాజా సామాజిక, ఆర్థిక సర్వే

ఉమ్మడి చిత్తూరు- నెల్లూరు జిల్లాల మధ్య వున్న ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాంతం పరిశ్రమల స్థాపనలో దేశంలోనే టాప్ 10లో ఒకటిగా నిలుస్తోంది. ఈ ప్రాంతంలో 2024లోనే రూ.12,830 కోట్ల పెట్టుబడితో పరిశ్రమలు వచ్చాయి. 11,925 మందికి ఉపాధి లభించింది. మరో 60 పెద్ద ప్రాజెక్టులు రూ.67,209 కోట్ల పెట్టుబడితో పురోగతిలో ఉన్నాయి. ఇవి పూర్తయితే, 94,026 మంది ఉపాధి లభించే అవకాశం ఉంది.విశాఖ నోడ్‌లోని అచ్యుతాపురం, చిత్తూరు నోడ్‌లోని నాయుడుపేటల్లోని ఇండస్ట్రియల్ పార్కుల్లోని పరిశ్రమలు మహిళా ఉద్యోగులకు సమాన వేతనం, ప్రసూతి సెలవులు, సంక్షేమం, పని ప్రదేశాల్లో భద్రత వంటి విషయాల్లో నిబంధనలు పాటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూచించాయి. ఆయా ప్రాంతాల్లోని 120 పరిశ్రమలు ప్రస్తుతం ఈ నిబంధనల్ని పాటిస్తున్నాయి.

2024-25 సామాజిక, ఆర్థిక సర్వేని రాష్ట్రప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. గత ఆర్థిక, విద్యా సంవత్సరాల ఆధారంగా ఈ నివేదిక పలు అంశాలను వెల్లడించింది. ఆయా అంశాల్లో మన జిల్లా ఏ స్థానంలో ఉంది.. సాధించిన ప్రగతి ఎంత.. అనే వివరాలు ఇందులో ఉన్నాయి.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

● శ్రీకాళహస్తి- ఏర్పేడు క్లస్టర్ అభివృద్ధికి రూ.436 కోట్లు

వైజాగ్- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పరిధిలో వైజాగ్, చిత్తూరు, కొప్పర్తి ఇండస్ట్రియల్ నోడ్స్ ఉన్నాయి. 33 వేల ఎకరాల్లో ప్లాన్ చేస్తుండగా, ఇందులో 30 శాతం స్టార్టప్ ప్రాంతంగా అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాంతాల్లో రూ.5 వేల కోట్ల అంచనా వ్యయంతో మౌలిక వసతులు కల్పించేందుకు ప్లాన్ చేస్తున్నారు. శ్రీకాళహస్తి- ఏర్పేడు క్లస్టర్ (చిత్తూరు నోడ్) కింద 2628 ఎకరాల్లో స్టార్టప్ ప్రాంతంగా అభివృద్ధి చేయనున్నారు. రూ.463 కోట్ల అంచనాతో మౌలిక వసతులు కల్పించనున్నారు.

● మహిళలకు రూ.25.03 కోట్ల సబ్సిడీ

జిల్లాలో మొత్తం 1379 రేషన్ దుకాణాలుండగా.. అంత్యోదయ, తెల్ల రేషన్‌కార్డులు కలిపి 5,43,282 ఉన్నాయి. వీటికిగానూ నెలకు 9306 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. అలాగే దీపం-2 పథకం కింద జిల్లాలో 3,09,070 మంది లబ్ధిదారులు ఇప్పటివరకు రూ.25.03 కోట్ల సబ్సిడీని పొందారు. జిల్లాలో 487,631 దీపం కింద, 4212 సీఎస్ఆర్, 14,960 పీఎంయూవై, 197963 జనరల్ కనెక్షన్స్.. మొత్తంగా 7,04,767 ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి.

● మల్బరీలో ముందంజ



జిల్లాలో 44,466 ఎకరాల్లో 28,380 మంది రైతులు మల్బరీని పండిస్తున్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు 20714.6 మెట్రిక్ టన్నుల పట్టు గూళ్ల, 2858 మెట్రిక్ టన్నుల పట్టు ఉత్పత్తి అయింది. జిల్లాలో 18 అగ్రికల్చర్ మార్కెట్ కమిటీల గోడౌన్లు 17,950 మెట్రిన్ టన్నుల కెపాసిటీతో ఉన్నాయి. జిల్లాలో 2024 డిసెంబరు వరకు రూ.6.83 కోట్ల మార్కెట్ ఫీజు వసూలైంది.

● ఏనుగుల నష్టం రూ.73.40 లక్షలు



జిల్లాలో 32 ఏనుగులు పలు ప్రాంతాల్లో గుంపులు గుంపులుగా తిరుగాడుతూ పంటల్ని ధ్వంసం చేస్తున్నాయి. అప్పుడప్పుడూ మనుషుల ప్రాణాలూ తీస్తున్నాయి. గాయపరుస్తున్నాయి.2024వ సంవత్సరంలో ప్రభుత్వం రూ.73.40 లక్షల పరిహారాన్ని జిల్లాలో గజ బాధిత కుటుంబాలకు పంపిణీ చేసింది.

● ఎర్రచందనానికి రూ.కోట్లతో రక్షణ



రెడ్‌సాండర్స్ ప్రొటెక్షన్ స్కీమ్ ద్వారా చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, నెల్లూరు, కడప, నంద్యాల జిల్లాల్లోని శేషాచలం, వెలిగొండ, లంకమల, నల్లమల, తలకోన కొండల్లోని 5300 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉన్న ఎర్రచందనం చెట్ల రక్షణకోసం 2023-24వ సంవత్సరంలో రూ.25 కోట్లను కేటాయించగా, రూ.15.29 కోట్లను ఖర్చు చేశారు. అలాగే 2024 ఏప్రిల్ నుంచి జూలై వరకు రూ.8.22 కోట్లను, ఆగస్టు నుంచి నవంబరు వరకు రూ.9.34 కోట్లను కేటాయించారు.

● 53.862 మెట్రిక్ టన్నుల మాంసం ఉత్పత్తి

జిల్లాలో గతేడాది ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు 917.223 మెట్రిక్ టన్నుల పాలు, 53.862 మెట్రిక్ టన్నుల మాంసం, 10428.184 మెట్రిక్ టన్నుల గుడ్లు ఉత్పత్తి అయ్యాయి.

● కోట్లలో డిపాజిట్లు

జిల్లాలో మొత్తం 283 బ్యాంకు బ్రాంచులు ఉండగా.. వాటిలో రూ.14,703.11 కోట్లను డిపాజిట్ చేసుకోగా.. బ్యాంకులు రూ.21,100.81 కోట్లను రుణాలుగా ఇచ్చాయి.

● జిల్లాలో 2023-24లో రవాణా వాహనాల రిజిస్ట్రేషన్ ద్వారా రూ.118.2 కోట్లు, 2024 డిసెంబరు వరకు రూ.97.69 కోట్లు వసూలైంది.

● కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి డిసెంబరు ఆఖరు వరకు జిల్లాలో 319,391 మంది ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా చికిత్స పొందగా.. వారి కోసం రూ.658 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది.

● 2024-25 సంవత్సరానికి 2024 డిసెంబరు వరకు 2,72,320 మంది అర్హులకు రూ.984.65 కోట్ల ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు.

● కుప్పంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో 3,36,500 అంటుకట్టిన కూరగాయాల మొలకలను ఉత్పత్తి చేసి రైతులకు అందుబాటులో ఉంచారు. 2025-26 సంవత్సరంలో ఇక్కడ మరో 87 లక్షల అంటుకట్టిన, అంటుకట్టని మొలకలను ఉత్పత్తి చేయనున్నారు.

విద్యార్థుల విహార యాత్రలకు రూ.7.44 లక్షల విడుదల

చిత్తూరు సెంట్రల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో విద్యార్థులను విహారయాత్రలకు తీసుకెళ్లడానికి రూ.7.44 లక్షలు విడుదలైనట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ తెలిపారు. ప్రైమరీ పాఠశాలల్లో 186 మంది, ఉన్నత పాఠశాలల్లో 186 మంది మొత్తంగా 372 మంది విద్యార్థులను విహార యాత్రలకు ఉచితంగా తీసుకెళ్లే సౌకర్యం ఉందన్నారు. జిల్లా పరిధిలో విహార యాత్రకు వెళ్లడానికి ఒక్కో విద్యార్థికి రూ.200 కేటాయించగా, పక్క రాష్ట్రంలోని ప్రదేశాలకు వెళ్లడానికి ఒక్కో విద్యార్థికి రూ.2వేల చొప్పున ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.

సీఆర్‌సీలకు రూ.4.17 కోట్ల నిధులు

విద్యాశాఖ పరిధిలోని సమగ్రశిక్ష ద్వారా నిర్వహిస్తున్న క్లస్టర్ రిసోర్స్ సెంటర్లకు రూ.4.17 కోట్లు నిధులు విడుదలైనట్లు ఏపీసీ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 348 సీఆర్‌సీలు ఉన్నాయని, ఒక్కో సెంటర్‌లోని అభివృద్ధికి రూ.1.10 లక్షలు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.

నేడు జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

చిత్తూరు సెంట్రల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ బుధవారం చిత్తూరులోని లిటిల్ ఫ్లవర్ స్కూల్లో నిర్వహించనున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ తెలిపారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో మాట్లాడుతూ.. మండల, డివిజన్ స్థాయిలో ఎంపికైన నమూనాలు జిల్లాస్థాయిలో ప్రదర్శిస్తారని, అలాగే వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు ఉంటాయన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు.

ఇంటర్ పరీక్షలకు 937 మంది గైర్హాజరు

చిత్తూరు సెంట్రల్, మార్చి4 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఇంటర్ ఫస్టియర్ ఇంగ్లీష్ పరీక్షలు జరిగాయి. 16,986 మంది విద్యార్థులకుగాను 16,049 మంది హాజరవగా, 937 మంది గైర్హాజరైనట్లు డీవీఈవో సయ్యద్‌మౌల తెలిపారు. డీవీఈవో, స్పెషల్ అధికారి, పరీక్షల జిల్లా కమిటీ సభ్యులు, స్క్వాడ్ పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

అంగన్వాడీలకు చిన్నసైజు గుడ్ల సరఫరా

● ఆహార భద్రత కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్ రెడ్డి



పెనుమూరు జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న విజయ్ ప్రతాప్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి):గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రవేశపెట్టిన ఎండీయూ వాహనాల వ్యవస్థపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వస్తున్నాయని రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్ రెడ్డి అన్నారు. చిత్తూరు జిల్లాలో మంగళవారం విస్తృతంగా పర్యటించిన ఆయన చిత్తూరు ఆర్అండ్‌బీ అతిథిగృహంలో మీడియాతో మాట్లాడారు.ఎండీయూ వాహనాల వ్యవస్థ రద్దు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. కాంట్రాక్టర్లు చిన్నసైజు కోడిగుడ్లను అంగన్వాడీలకు సరఫరా చేస్తున్నట్లు తన పర్యటనలో గుర్తించానన్నారు.టెండర్‌లో పేర్కొన్న విధంగా పెద్దసైజు కోడిగుడ్లను సరఫరా చేసేలా కాంట్రాక్టర్‌పై ఒత్తిడి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. డీఎస్వో శంకరన్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ బాలకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా తనిఖీలు : రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్ రెడ్డి మంగళవారం పూతలపట్టు, పెనుమూరు, శ్రీరంగరాజపురం, గంగాధరనెల్లూరు, బంగారుపాళ్యం, పలమనేరు, పుంగనూరు మండలాల్లో పర్యటించారు. స్థానిక అంగన్వాడీలను, చౌకదుకాణాలను, ఎండీయూ వాహనాలను, పీహెచ్‌సీలను, వసతిగృహాలను, మండల లెవల్ స్టాక్ పాయింట్లను, గురుకుల, జడ్పీ పాఠశాలలను తనిఖీ చేశారు. డీఎస్వో శంకరన్, సివిల్ సప్లయ్ డీఎం బాలకృష్ణ, డీఈవో వరలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, సాంఘిక, వెనుకబడిన సంక్షేమశాఖల డీడీలు చెన్నయ్య, రబ్బాని బాషా, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీ రుణాలకు ఇంటర్వ్యూలకు 824మంది

చిత్తూరు అర్బన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ ద్వారా అందించనున్న రాయితీ రుణాల కోసం చేపట్టిన ఇంటర్వ్యూలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. తొలి రోజు జరిగిన ఇంటర్వ్యూకు 824 మంది దరఖాస్తుదారులు హాజరయ్యారు. లబ్ధిదారుల కోసం కార్యాలయ ఆవరణంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్, బ్యాంకర్లతో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. నగరపాలక సంస్థ పరిధిలోని 38 బ్యాంకు బ్రాంచీల అధికారులు, ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కమిషనర్ నరసింహప్రసాద్, సహాయ కమిషనర్ ప్రసాద్ పర్యవేక్షించారు. మేయర్ అముద, డిప్యూటీ మేయర్లు రాజేష్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌లు పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. నగరపాలక పరిధిలోని 26 నుంచి 50 డివిజన్ల వారికి బుధవారం ఇంటర్వ్యూలు జరగనున్నాయి. మంగళవారం హాజరుకానివారు బుధవారం రావచ్చని కమిషనర్ సూచించారు.



ఇంటర్వ్యూకు హాజరైన లబ్ధిదారులు



ధ్రువపత్రాన్ని చూపుతున్న మేయర్ అముద

పీపీ, ఏపీపీల తొలగింపు

చిత్తూరు లీగల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో నియామకమైన ఐదుగురు పీపీ, ఏపీపీలను తొలగిస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. జిల్లా కోర్టు పీపీగా ఉన్న పులికల్లు రవీంద్రారెడ్డి, 6వ అదనపు జిల్లా కోర్టు ఏపీపీ తోట పురుషోత్తం, 9వ అదనపు జిల్లా కోర్టు ఏపీపీ హిమబిందు, అడిషినల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు ఏపీపీ స్వాతిలను ఆ పదవిలోనుంచి తొలగించారు. అలాగే ఒకటో అదనపు జిల్లా కోర్టు పీపీ లోకనాథరెడ్డి స్వచ్ఛందంగా తన రాజీనామాను ప్రభుత్వానికి పంపగా, ఆమోదించింది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం) : 6.27

సహరి (గురువారం) : 5.06

శివరాత్రి ఉత్సవాలు సమాప్తం

● సూర్య,చంద్రప్రభ వాహనాలపై మొగిలీశ్వరుడి విహారం



సూర్యప్రభ వాహనంపై విహరిస్తున్న భోళా శంకరుడు

బంగారుపాళ్యం,మార్చి4(ఆంధ్రజ్యోతి):బంగారుపాళ్యం మండలం మొగిలిలోని కామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి శివరాత్రి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. పార్వతీపరమేశ్వరులు సూర్య,చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు.ఆలయ ప్రధాన అర్చకులు గంగాధరగురుకుల్ ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలోని అలంకార మండపంలో స్వామి,అమ్మవారి ఉత్సవర్లను సుగంధ భరితమైన పూలతో, స్వర్ణాభరణాలతో అలంకరించారు. సూర్యప్రభ వాహనంపై అధిష్ఠింపజేసి మాడవీధుల్లో ఊరేగించారు.కేఎస్ఎన్ ఫుడ్ ప్రోడక్ట్స్ యాజమాన్య ప్రతినిధులు ఉభయదారులుగా వ్యవహరించారు. సాయంత్రం వసంతోత్సవం నిర్వహించాక త్రిశూలతీర్థంలో త్రిశూల స్నానం నిర్వహించారు.ఉత్సవాల ప్రారంభ సందర్భంగా ఆలయంలో ఎగురవేసిన ధ్వజపటాన్ని అర్చకుల వేదమంత్రోచ్చారణ నడుమ సాయంత్రం 6 గంటలకు కిందకు దించారు. రాత్రి అలంకార మండపంలో ఉత్సవమూర్తులను సర్వాంగసుందరంగా అలంకరించి చంద్రప్రభవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు.కేబీఆర్ మొబైల్ ప్లాజా యజమానులు రమ్యప్రదీప్ దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతరం బ్రాహ్మణసంఘం,పురోహితులు,అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారి శయనోత్సవం వైభవంగా జరిగింది.ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంబీ విజయకుమార్,ఈవో మునిరాజ, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.



చంద్రప్రభ వాహనంపై ఆది దంపతులు

అతివేగానికి బీటెక్ విద్యార్థి బలి



గరుడ వారధి రక్షణ గోడపై అభిరామ మృతదేహం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 4(ఆంధ్రజ్యోతి): గరుడ వారధి ఎక్కారు. బైకును మితిమీరిన వేగంతో నడిపారు. రామానుజ సర్కిల్ వద్ద బైకును అదుపు చేయలేక రక్షణ గోడను ఢీకొని అలాగే పైకి ఎగిరి పడ్డారు. రక్షణ గోడపైన పడిన యువకుడు మృతిచెందగా.. రోడ్డుపై పడిన మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. తిరుపతిలోని ఫ్లైఓవర్‌పై మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన ప్రకారం.. అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన అభిరామ్ నాయుడు.. తిరుపతిలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. సహ విద్యార్థి సునీల్‌తో కలిసి తిమ్మినాయుడుపాలెంలో ఒక గదిని అద్దెకు తీసుకుని వుంటున్నాడు. వీరిద్దరూ కలసి ద్విచక్ర వాహనంలో తిరుచానూరుకు వెళ్లారు. మంగళవారం వేకువజామున తిరుగు ప్రయాణంలో స్థానిక మామిడి కాయల మండీ వద్ద గరుడ వారధిపైకి ఎక్కారు. ఆర్టీసీ బస్టాండు వైపు అతివేగంతో వస్తున్నారు. రామానుజపల్లి సర్కిల్ వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పి పక్కనే వున్న డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో అభిరామ్ నాయుడు (24) డివైడర్‌పై పడి తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడివెనుక కూర్చుని ఉన్న సునీల్ కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఇతడ్ని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. ఈ ఘటనకు ప్రధాన కారణం అతి వేగం.. నిర్లక్ష్యమే కారణమని ఎస్ఐ చెప్పారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేశారు.


భక్తులను కలిసి అభిప్రాయ సేకరణ చేస్తున్న శ్రీవారి సేవకులు

నమస్కారం.. చెప్పండి మీ అభిప్రాయం!

● టీటీడీలో మొదలైన 'ఫీడ్‌బ్యాక్ మేనేజ్మెంట్ సిస్టమ్'

తిరుమల, మార్చి4(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనం, సేవలు, దర్శనానికి వచ్చిన సమయంలో కలిగిన ఇబ్బందులు వంటి అంశాలపై భక్తుల నుంచి టీటీడీ అభిప్రాయ సేకరణ మొదలైంది. ఏపీ డిజిటల్ కార్పొరేషన్ సహకారంతో 'ఫీడ్ బ్యాక్ మేనేజ్మెంట్ సిస్టమ్' ప్రారంభించారు. భక్తుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు మూడు పద్ధతులను టీటీడీ ఏర్పాటు చేసుకుంది. ఐవీఆర్ఎస్(ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్ సిస్టమ్), వాట్సాప్ మెసెజ్ మోడ్, ఫిజికల్ సర్వే ల ద్వారా అభిప్రాయాలు తెలుసుకుంటున్నారు. దీనికి 'నివేదన' అనే పేరును పెట్టారు. ఐవీఆర్ఎస్, ఫిజికల్ సర్వే పద్ధతలను టీటీడీ ఫిబ్రవరి నుంచి అమలు చేస్తోంది.

అన్నీ బావున్నాయి!

గత నెల 14 నుంచి 20వ తేద వరకు శ్రీవారిని దర్శించుకున్న వారిలో 36,385 మందికి కాల్స్ వెళ్లగా అందులో 13,294 మంది స్పందించారు. వీరిలో 61.12 శాతం మంది బాగుందనగా, 27 శాతం పర్వాలేదని, మరో 11.88 శాతం బాగాలేదనే జవాబులిచ్చారు. ఫిబ్రవరి మొదటి వారంలో 2,244 మంది భక్తులను ఫిజికల్ సర్వేతో 9 ప్రశ్నలు అడిగారు. 72.5 శాతం బాగుందని, 18.7 శాతం పర్వాలేదని, 8.8 శాతం బాగోలేదనే సమాధానాలు అందాయి. దీని ద్వారా ఆ సమస్యలను వెంటనే పరిష్కరించేలా ఆయా విభాగాలకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కాగా వాట్సాప్ మెసెజ్ మోడ్‌ను కూడా ప్రారంభించనున్నారు.

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 13 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.74 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,683

తలనీలాలు సమర్పించినవారు: 23,453



ఫటా ఫట్

తిరుపతిలో జాతీయస్థాయి ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. తూకివాకం వద్ద 35ఎకరాల్లో క్రీడాప్రాంగణం ఏర్పాటుకు శాప్‌చైర్మన్ రవినాయుడు కృషి చేస్తున్నారు. మరోపక్క క్రీడా వికాస కేంద్రాల అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. జిల్లాలో క్రీడాభివృద్ధికి జరుగుతున్న కృషి గురించి జిల్లా క్రీడాధికారి సయ్యద్ 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారిలా..

- తిరుపతి(క్రీడలు), ఆంధ్రజ్యోతి

రెండేళ్లలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్

● జిల్లా క్రీడాధికారి సయ్యద్

స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులెంతవరకు వచ్చాయి?

ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో శిథిలావస్థకు చేరుకున్న శ్రీనివాస క్రీడా సముదాయ అభివృద్ధి పనులను రూ.2కోట్లతో మొదలుపెట్టాం. ఇండోర్ స్టేడియంలో న్యూ ఉడెన్ ఫ్లోరింగ్, పెయింటింగ్, పైఅంతస్తులో రైఫిల్ షూటింగ్, జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నాం. వాకింగ్‌ట్రాక్ పునరుద్ధరిస్తున్నాం. టెన్నిస్‌కోర్టు, సింథటిక్ లేయర్స్, గాల్వనైజింగ్ ఫెన్సింగ్‌కు రంగులు, ఈతకొలను మరమ్మతులు, గార్డెన్, మల్టీపర్పస్ స్పోర్ట్స్ ఎరీనా వంటి పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

ఎన్టీఆర్ క్రీడా వికాసకేంద్రాల పరిస్థితి ఏమిటి?

చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడులలో ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నాం. ఐదేళ్లుగా మరుగునపడిన ఈ కేంద్రాలను బాగుచేయడానికి ప్రభుత్వం అనుమతించింది. పెవిలియన్ బిల్డింగ్, ఇండోర్ స్టేడియం, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడా సౌకర్యాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేస్తున్నాం. సంరక్షకులు, సిబ్బంది నియాకానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.

ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్ కాంప్లెక్స్ ఎప్పటికి పూర్తవుతుంది?

శాప్ చైర్మన్ రవినాయుడు ఆధ్వర్యంలో తూకివాకం దగ్గర 35ఎకరాల భూమిని పరిశీలించాం. కలెక్టర్ ఇక్కడే ఏర్పాటుచేయాలని భావిస్తున్నారు. స్పోర్ట్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రాజెక్టు ప్రారంభమై పనులు చురుగ్గా సాగితే రెండేళ్లలో రెడీ అవుతుందని అనుకుంటున్నాం.

కోచ్‌ల భర్తీకి చర్యలు తీసుకుంటున్నారా?

కోచ్‌ల భర్తీపై ప్రభుత్వానికి నివేదించాం. హాకీ, పుట్‌బాల్, జూడో,రెజ్లింగ్, స్విమ్మింగ్, స్కేటింగ్,వాలీబాల్, టెన్నిస్, ఖేలోఇండియా, హాకీ శిక్షకులు అందుబాటులో ఉన్నారు.

ఈసారి సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తారా?

ఈఏడాది 25వంతున రూరల్, అర్బన్ ప్రాంతాలను ఎంపికచేసి మెరుగ్గా సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తాం. ఈ బాధ్యతలను ఔత్సాహిక పీడీ, పీఈటీలకు అప్పగిస్తాం. ఇందుకు గ్రాంట్స్ ఇస్తాం. ప్రతిభ చాటిన క్రీడాకారులకు బహుమతులు అందజేస్తాం.



మేమింతే.. మారమంతే!





నిబంధనలదేముందీ.. సవాలక్ష ఉంటాయి. అమలు చేయాలి కదా! తిరుపతి నగరంలో ఐదేళ్లూ సాగిన అస్తవ్యస్థ ట్రాఫిక్ వ్యవస్థే ఇప్పటికీ చెక్కుచెదరకుండా కొనసాగుతోంది. కూడళ్లలో ట్రాఫిక్ పోలీసుల ఆచూకీ చాలా సార్లు కనిపించదు. కనిపించినా వారిది ప్రేక్షక పాత్ర మాత్రమే. ఉల్లంఘిస్తున్నారని ఎవర్నైనా ఆపితే.. ఎలాగూ నాయకుల నుంచి ఫోన్లు వస్తాయని అనుకుంటున్నారేమో.. చేతికి ఏదీ అంటకుండా గడిపేస్తున్నారు. ఏకంగా గరుడ వారధి మీదే ఎదురు ప్రయాణాలు సాగుతూ ఉంటాయి. ఎర్ర లైటు వెలుగుతున్నా కూడళ్లలో దూసుకుపోతూనే ఉంటారు. ఇక ఒకే వాహనం మీద ముగ్గురు కాదు.. నలుగురూ, ఐదుగురూ కూడా రయ్ మంటూ ప్రమాదాలను వెతుక్కుంటూ వెళ్లిపోతుంటారు. ఇంత గందరగోళపు ట్రాఫిక్‌లోనూ మొబైల్‌లో మాట్లాడుతూ ఫీట్‌లు చేస్తుంటారు. తిరుపతి నగర ట్రాఫిక్ పోలీసు వ్యవస్థ పనితీరుకు సాక్ష్యమే మంగళవారం కనిపించిన ఈ దృశ్యాలు..

-తిరుపతి, ఆంధ్రజ్యోతి



రేణిగుంటలో ఎండీయూ ఆపరేటర్ నిర్వాకం

● కాటాకు అయస్కాంతం అంటించి బియ్యం పంపిణీ

● 10 కిలోలకు కిలో స్వాహా

రేణిగుంట మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలో ఓ ఎండీయూ(మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) ఆపరేటర్ నిర్వాకంపై రేషన్ కార్డుదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు ఇచ్చే రేషన్ బియ్యంలో కాటాకు అయస్కాంతం అంటించి ప్రతి 10 కిలోలకు కిలో స్వాహా చేస్తున్న సంఘటన మంగళవారం అత్తూరు గ్రామంలో వెలుగు చూసింది. స్థానిక కార్డుదారులు తెలిపిన వివరాలు... అత్తూరులో ప్రతి నెలా ఎండీయూ ఆపరేటర్ గిరి గ్రామానికి చేరుకుని కార్డుదారులకు రేషన్ సరుకులు అందిస్తుంటాడు. అయితే మంగళవారం గ్రామంలో రేషన్ అందిస్తుండగా కాటాకు అయస్కాంతం అంటించి ఉండడాన్ని యువకులు గమనించి ఫొటోలు తీశారు. దీనిపై ఆపరేటర్ గిరిని ప్రశ్నించారు. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ గిరి బదులిచ్చారు. కాగా కార్డుదారులు మాట్లాడుతూ... గత వైసీపీ హయాం నుంచి ఆపరేటర్ ఇలాగే సరుకులు పంపిణీ చేస్తున్నాడని, దీనిపై పలుమార్లు వీఆర్వోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. దీంతో యువకులు కాటాకు అయస్కాంతం అంటించిన ఫొటోను ఎమ్మెల్యేకు చేరేంత వరకు షేర్ చేయాలని హ్యాష్ ట్యాగ్ తగిలిచ్చి ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేయడంతో మండలంలో వైరల్‌గా మారింది. ఈవిషయంపై తహసీల్దార్ సురేష్‌బాబుని వివరణ కోరగా... ఆపరేటర్ గిరిపై పలు ఫిర్యాదులు అందాయన్నారు. మంగళవారం జరిగిన నిర్వాకం తన దృష్టికి వచ్చిందని అతనిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు


కాటాకు అంటించిన అయస్కాంతం

అప్పుల బాధతో లైన్‌మ్యాన్ బలవన్మరణం

● విధులు నిర్వహిస్తున్న సబ్‌స్టేషన్‌లోనే ఘటన ● సూసైడ్ నోట్‌లో అప్పుల వివరాలు

ఓజిలి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తట్టుకోలేక ట్రాన్స్‌కో లైన్‌మ్యాన్ సీహెచ్ మురళీకృష్ణ(57) మంగళవారం విధులు నిర్వహిస్తున్న సబ్‌స్టేషన్‌లోనే ఉరేసుకుని మృతి చెందాడు. ఓజిలి ఎస్ఐ స్వప్న కథనం మేరకు వివరాలు... ఓజిలి మండలం అత్తివరం గ్రామానికి చెందిన మురళీకృష్ణ కురుగొండ సబ్ స్టేషనులో లైన్‌మ్యాన్‌గా పని చేస్తున్నారు. చాలాకాలంగా భార్యతో కలిసి నాయుడుపేటలో నివాసం ఉంటున్న ఆయన సోమవారం ఉదయం విధులకు వెళ్లారు. మంగళవారం ఉదయం 9 గంటలకు రిలీవ్ అవ్వాల్సి ఉంది. 8 గంటల సమయంలో ఏఈ అనిల్ ఫోన్ చేయగా మురళీకృష్ణ లిఫ్ట్ చేయలేదు. మళ్లీ మళ్లీ ఫోన్ చేసినా స్పందించకపోవడంతో మరో ఉద్యోగిని సబ్‌స్టేషను వద్దకు పంపారు. అతను వెళ్లి ఎంతసేపు తలుపు కొట్టినా తీయకపోవడంతో అనుమానం వచ్చి కిటికీలో నుంచి చూడగా మురళీకృష్ణ శ్లాబ్ కొక్కీకి ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే ట్రాన్స్‌కో ఏడీ, ఏఈతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సబ్‌స్టేషను వద్దకు చేరుకుని తలుపులు పగలగొట్టి మురళీకృష్ణ మృతదేహాన్ని కిందికి దింపారు. రికార్డులు పరిశీలించగా సోమవారం రాత్రి 12 గంటల వరకు విద్యుత్ రీడింగ్ నమోదు చేసినట్లు ఉంది. ఒంటిగంట నుంచి రీడింగ్ నమోదు చేయకపోవడంతో రాత్రి 12 - 1 గంట మధ్య ఉరేసుకుని ఉంటాడని ఎస్ఐ స్వప్న తెలిపారు. మురళీకృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఉరికి వేలాడుతున్న మురళీకృష్ణ

అప్పుల వివరాలతో లేఖ

మురళీకృష్ణ ఉరేసుకునే ముందు తాను చేసిన అప్పుల వివరాలు రాసిపెట్టిన లేఖ సబ్‌స్టేషన్‌లో లభ్యమైంది. మొత్తం 26 మంది వద్ద అప్పు చేశానని, అందులో ఏడుగురు లాటరీ వాళ్లు ఉన్నట్లు తెలిపాడు. 19 మందికి రూ.7.71లక్షలు, ఏడుగురు లాటరీ వాళ్లకు రూ.60లక్షలు బాకీ ఉన్నట్లు లేఖలో పేర్కొన్నాడు. ఈ లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఇదేమి విడ్డూరం సారూ..!

● గతంలో పనిచేసిన అధికారికి విచారణ బాధ్యతలు

పుత్తూరు అర్బన్, మార్చి4(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీలో అవినీతి ఆరోపణలపై ఆర్డీ విశ్వనాథ్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీలో విడ్డూరం నెలకొంది. 2019 నుంచి 2024 వరకు మున్సిపాలిటీలో అన్ని విభాగాల్లో అవినీతి జరిగిందని ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఫిర్యాదులను ఆధారంగా చేసుకుని సమగ్రస్థాయిలో విచారణ జరిపేందుకు కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే 2019 నుంచి నాలుగు సంవత్సరాల పాటు టౌన్ ప్లానింగ్ అధికారిగా సుభప్రద పనిచేశారు. కాగా, నేడు పట్టణ ప్రణాళిక విభాగంలో అవినీతి అక్రమాల విచారణ బాధ్యతలను ఆమెకు అప్పగించారు. ఈ పరిణామంపై స్థానికులు విస్మయం చెందుతున్నారు. దీనివల్ల విచారణలో పారదర్శకత ఎంత మాత్రం ఉంటుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గూడ్స్ ఇంజన్‌లో సాంకేతిక సమస్య అరగంట ఆలస్యంగా నడిచిన రైళ్లు

రేణిగుంట, మార్చ్ 4, (ఆంధ్రజ్యోతి): రైలు ఇంజన్లో సాంకేతిక సమస్య తలెత్తడంతో రేణిగుంట మీదుగా కడప వైపు వెళ్లాల్సిన పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు మంగళవారం రాత్రి అరగంట ఆలస్యంగా నడిచాయి. వివరాల్లోకి వెళితే... మంగళవారం రాత్రి 7 గంటల నుంచి రేణిగుంట మీదుగా కడప వైపు వెళ్లాల్సిన రాయలసీమ, కాచిగూడ, ఎగ్మోర్, వెంకట్రాది ఎక్స్‌ప్రెస్‌లు హైదరాబాద్, సికింద్రాబాద్‌కు చేరుకోవాల్సి ఉంది. ఈక్రమంలో మాముండూరు వద్ద రేణిగుంటకు వస్తున్న గూడ్స్ రైలు ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఇంజన్ పైలట్ గూడ్స్‌ను ఆపేశారు. దీంతో కడప రైల్వే స్టేషన్‌లో పలు రైళ్లను ఆపేశారు. ఇక్కడి నుంచి వెళ్లాల్సిన రైళ్లను పంపించారు. దీంతో ఈ రూటులో వెళ్లాల్సిన రైళ్లు అరగంట ఆలస్యంగా నడిచాయి.

న్యాయం కావాలంటూ..

● వెటర్నరీ విద్యార్థుల వినూత్న నిరసన

తిరుపతిరూరల్, మార్చి4 (ఆంధ్రజ్యోతి): న్యాయ దేవత వేషధారిణికి ఒక చేతిలో భారత రాజ్యాంగం. మరో చేతిలో త్రాసు. అందులో ఒక వైపు వెటర్నేరియన్ల కష్టం, ప్రొఫెషన్ ప్రాముఖ్యత బరువైన బ్లాకులుగా ఉంచారు. మరోవైపు తక్కువ మొత్తంలో స్టైఫండ్‌ని చిన్నపెట్టెలో ఉంచారు. విద్యార్థుల కష్టాల బరువు ఎక్కువగా ఉండటంతో త్రాసు సమతుల్యం కాదని.. న్యాయం ఎటువైపుకి ఒరగాలి.. అంటూ వెటర్నరీ విద్యార్థులు మంగళవారం వినూత్న తరహాలో నిరసన తెలిపారు. వైద్యవిద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలంటూ నెల రోజులుగా వీరు చేపట్టిన నిరవధిక సమ్మె.. మంగళవారమూ కొనసాగింది. వర్సిటీ ప్రధానగేటు వద్ద ఏర్పాటు చేసిన దీక్షాశిబిరంలో విద్యార్థులు బైఠాయించి ప్లకార్డులు చేతపట్టారు. తమ హక్కులకోసం ప్రభుత్వాన్ని, వర్సిటీ అధికారులను వేడుకుంటున్నా గుర్తించకపోవడం బాధాకరమన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ పి.జగపతిరామయ్య విద్యార్థుల వద్దకు వచ్చి వెంటనే సమ్మెని విరమించి తరగతులకు హాజరుకావాలని, లేకుంటే బుధవారం నుంచి హాస్టళ్ల మెస్‌లని మూసివేస్తామన్నారు. ఆ మరుసటిరోజున హాస్టళ్లు ఖాళీచేయాల్సి ఉంటుందని వివరించారు. హాస్టళ్లను మూసినా సమ్మె కొనసాగిస్తామని విద్యార్థులు అంటున్నారు.

నేటినుంచి మెస్ సేవలు నిలిపివేత

నెల రోజులుగా తరగతులను బహిష్కరించి సమ్మెబాటలో ఉన్నందున్న బుధవారం నుంచి హాస్టళ్లకి అనుబంధంగా ఉన్న మెస్‌సేవలను నిలుపుదల చేస్తూ వర్సిటీ అధికారులు నోటీసు జారీ చేశారు. ఈమేరకు విద్యార్థులకు మెస్‌సేవలు ఉండవని, అలాగే గురువారానికి హాస్టళ్లని పూర్తి స్థాయిలో ఖాళీ చేయాల్సిఉందని నోటీసులో పేర్కొన్నారు.



నా వ్యక్తిగత సమస్యను రాజకీయం చేస్తున్నారు

● రెండు పార్టీల నేతలపై లక్ష్మీరెడ్డి విమర్శ



తిరుపతి(వైద్యం), మార్చి 4(ఆంధ్రజ్యోతి): 'నా ఆర్థిక లావాదేవీల సమస్యకోసం నేను మీడియా ముందుకు వచ్చా. ఆ సమస్యను ఆసరాగా తీసుకొని అధికార, ప్రతిపక్ష నేతలు వారి రాజకీయ లబ్ధి కోసం సోషల్ మీడియాలో తప్పుగా ట్రోల్స్ చేస్తున్నారు' అని ఇటీవల కిరణ్‌రాయల్‌పై ఆరోపణలు చేసిన లక్ష్మీరెడ్డి పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'నేను నా ఆత్మహత్యాయత్నానికి సంబంధించిన ఒక్క వీడియో మాత్రమే విడుదల చేశా. అది కాకుండా సోషల్ మీడియాలో ట్రోల్ అవుతున్న మిగతా వీడియోలు, ఫొటోలన్నీ కొందరు రాజకీయ లబ్ధి కోసం పోస్టు చేశారు. అందులో నా ప్రమేయం లేదు. కిరణ్‌రాయల్ సొంత పార్టీకి చెందిన నేతలే ఏడాది కిందట నా వద్దకొచ్చి న్యాయం చేస్తామని చెప్పి ఆధారాలు తీసుకెళ్లారు. ప్రతిపక్ష పార్టీ నేతలతో కలిసి ఇప్పుడు వాటిని తప్పుగా ప్రచారం చేస్తున్నారు. ఇందులో జనసేనకు చెందిన జిల్లా నేత ప్రమేయమే ఎక్కువగా ఉంది. ఇలా నా వ్యక్తిగత సమస్యను రాజకీయ లబ్ధికోసం రెండు పార్టీల నేతలు నాకు తెలియకుండా, నా విషయాన్ని తప్పుగా ప్రచారం చేశారు. దీనిపై ఇప్పటికే నేను ఆ నేతలపై ఎస్వీయూనివర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేశా. నాకే పార్టీతోనూ.. నేతలతోనూ సంబంధం లేదు. నా సమస్య పరిష్కారానికే పోరాటం చేశా. ఇప్పుడు నా ఆరోగ్య పరిస్థితి బాగోలేదు. సోషల్ మీడియాలో వస్తున్న ట్రోల్స్‌ను చూసి నా బిడ్డలు ఇంతటితో దీనికి ఫుల్‌స్టాప్ పెట్టమని కోరడంతో, దీనిని ఇంతటితో ముగిద్దామనుకుంటున్నా' అని ఆమె పేర్కొన్నారు. జనసేన పార్టీలోని ఆ జిల్లా నేత ఎవరని మీడియా ప్రతినిధులు అడగ్గా.. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో అన్నీ తెలిపానన్నారు. ఇప్పటి వరకు ఏ పార్టీ నేతలూ తనకు మద్దతుగా లేరని, ఎవరి నుంచీ బెదిరింపులు లేవని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఒకవేళ ఉంటే జనసేన పార్టీకి చెందిన జిల్లా నేత నుంచి ప్రాణహాని ఉండొచ్చని, ఈ విషయాన్ని పోలీసులకూ చెప్పానన్నారు. వాళ్లు తనకు న్యాయం చేస్తారని బదులిచ్చారు.

ఉమ్మడి పీజీ సెట్ రద్దు కోసం

వర్సిటీలు, కాలేజీల బంద్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఉమ్మడి పీజీసెట్ రద్దు చేయాలంటూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం వర్సిటీలు, ప్రభుత్వ డిగ్రీ, పీజీ కాలేజీల బంద్ చేపట్టారు. పీజీ ప్రవేశాలు నిర్వహించుకునే వెసులుబాటు యూనివర్సిటీలకే అప్పగించాలని కోరుతూ కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్న వీరు బంద్‌కు పిలుపునిచ్చారు. యూనివర్సిటీలు, కాలేజీలను విద్యార్థి నేతలు కలియతిరుగుతూ బంద్ పర్యవేక్షించారు. ఎస్వీయూనివర్సిటీలో విద్యార్థి సంఘాలన్నీ బంద్ సందర్భంగా ర్యాలీ చేపట్టాయి. యూనివర్సిటీలోనే బైఠాయించి నిరసన తెలిపాయి. ఉమ్మడి పీజీసెట్ వల్ల రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఇప్పటికే పీజీ ప్రవేశాలు భారీగా తగ్గాయని గుర్తుచేశారు. భవిష్యత్తులో యూనివర్సిటీలే మూత పడే ప్రమాదం ఉందన్నారు. పీజీ అడ్మిషన్లు యూనివర్సిటీలే నిర్వహించుకునేటప్పుడు యూనివర్సిటీల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ విధానాన్నే కూటమి ప్రభుత్వం కూడా అనుసరించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శివారెడ్డి, చలపతి, ఎస్ఎఫ్ఐ నాయకులు రవి, అక్బర్, ఎన్ఎస్‌యూఐ నేత జెన్నే మల్లికార్జున, లా విద్యార్థి సంఘ నేత సుందర్రాజు, బీసీ విద్యార్థి సంఘ నేత తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.


బంద్‌లో పాల్గొన్న వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు

తిరుమలలో మెరుగైన సేవలపై నివేదిక


ఈవో శ్యామలరావుతో సత్యసాయి సేవా సంస్థ సభ్యులు

తిరుమల, మార్చి4(ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులకు మరింత బాధ్యతగా, మెరుగ్గా, సేవలందించేందుకు సత్యసాయి సేవా సంస్థకు చెందిన నలుగురు సభ్యుల బృందం సమగ్ర నివేదికను రూపొందించింది. బృందం సభ్యులు మంగళవారం తిరుపతి టీటీడీ పరిపాలన భవనంలో ఈవో శ్యామలరావును కలిసి నివేదికను అందజేశారు. దేశంలో పేరొందిన ఆధ్యాత్మిక సంస్థల నిర్వహణాపరమైన సూచనలను, సలహాలను తీసుకుని అమలు చేయాలనే సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు వీరు గతనెల 28 నుంచి ఐదురోజుల పాటు తిరుమలలో పరిశీలించి నివేదికను తయారుచేశారు. సభ్యులు రఘుపాత్రుని లక్ష్మణరావు, చుండూరి సురేంద్ర, కొమరగిరి శ్యాంప్రసాద్, విశ్వనాథరెడ్డిలు పలు సూచనలతో ఈవోకు నివేదిక సమర్పించారు. వీరిని శ్యామలరావు అభినందించారు. నివేదికలోని అంశాలు మెరుగైన సేవలు అందించేందుకు ఉపయోగపడుతాయని ఈవో అభిప్రాయపడ్డారు.

మామిడి కొమ్మల కత్తిరింపులతో తెగుళ్ల నివారణ

ఉద్యాన శాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఉద్యానశాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి

చిత్తూరు సెంట్రల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మామిడి కొమ్మల కత్తిరింపులు చేపడితే తెగుళ్ల నివారించవచ్చని ఉద్యానశాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక మ్యాంగో భవన్‌లో మామిడి సాగులో చేపట్టే సస్యరక్షణ అంశంపై రైతు కేంద్రాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ.. కాయలకు ఈగలు సోకకుండా కవర్లు కడితే అధిక దిగుబడి వస్తుందని చెప్పారు. సీనియర్ శాస్త్రవేత శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ.. మామిడిలో తేనె మంచు, తామర, ఈగ నివారణకు సిఫార్సు చేసిన మందులను తగిన మోతాదులో పిచికారీ చేయాలన్నారు. సేంద్రియ వ్యవసాయ కో-ఆర్డినేటర్ సంధ్య, ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల ఘనవిజయం

● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్

చిత్తూరు సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థులు ఘన విజయం సాధించారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వైసీపీ బలపరచిన అభ్యర్థులు పరాజయం పాలయ్యారని చెప్పారు. ఈ ఎన్నికల ఫలితాలను బట్టి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు సానుకూలంగా ఉన్నట్లు స్పష్టమైందని తెలిపారు. నేతలు మోహన్‌రాజ్, గోపాల్, మేషాక్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు



చిత్తూరు సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ లావాదేవీలకు కూడా దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరస్తులు మీ డబ్బుకంటే ముందు మీ మనసును హ్యాక్ చేస్తారని హెచ్చరించారు. ఇటీవల సైబర్ మోసాలు హెచ్చుమీరుతున్న నేపథ్యంలో ఢిల్లీ పార్లమెంటు సమావేశాల్లో కూడా ఈవిషయం చర్చకు వచ్చిందని పేర్కొన్నారు. సైబర్ మోసాలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో దేశంలో యూపీఐ మోసం కేసులు సుమారు 95వేలు దాటాయని వివరించారు. విజ్ఞతతో వ్యవహరిస్తే సైబర్ మోసాలను తిప్పికొట్టవచ్చునని ఆ ప్రకటనలో ఎంపీ తెలియజేశారు.

ఎక్స్‌ప్రెస్ వే ప్రమాదంలో మరొకరి మృతి



సుస్మిత(ఫైల్ ఫొటో)

వి.కోట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు - చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవేపై వి.కోటకు 20కిలోమీటర్ల సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో మృతుల సంఖ్య ఐదుకు చేరుకుంది.కర్ణాటక రాష్ట్రం కదిరిగాని కుప్పానికి చెందిన శీనప్ప కుమారుడు మహేష్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలసి బెంగళూరు నుంచి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న ఇన్నోవా కారు మాలూరు-కేజీఎఫ్ మధ్య కుప్పనల్లి సమీపంలో ఎదురుగా లైటు లేకుండా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారు శ్రీనాథ్‌తో పాటు,కారులో ప్రయాణిస్తున్న మహేష్ కుమార్ (52), ఆయన బంధువు కమ్మసంద్రకు చెందిన జయరామప్ప భార్య రత్నమ్మ, ఆమె కుమారుడు సంతోష్ ఏడాదిన్నర కుమార్తె ఉద్విత అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలోనే తీవ్రంగా గాయపడి బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంతోష్ భార్య సుష్మిత (30) మంగళవారం ఉదయం మృతి చెందింది.తల్లి, భార్య, కుమార్తెలను ఈప్రమాదంలో సంతోష్ పోగొట్టుకోగా,ఆయన కుమారుడు విరాట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

వైభవంగా ఉబ్బ దేవర!

కుల దైవానికి రజకుల జాతర







పూజలందుకున్న ఉబ్బమ్మ - ఉబ్బమ్మకు పూజలు చేస్తున్న ముత్తైదువలు - ఉబ్బ దేవరకు హాజరైన ప్రముఖులు

కుప్పం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రజక కుల దైవం ఉబ్బమ్మకు కొలుపు కుప్పంలో మంగళవారం వైభవంగా జరిగింది. కుప్పం నియోజకవర్గ రజక సంఘం నాయకులు సీఆర్.మోహన్ ఆధ్వర్యంలో దోబీఘాట్ ఆవరణలో ఉబ్బ దేవర నిర్వహించారు. కుప్పంలోని చిన్నమ్మ దేవాలయ ప్రాంగణంలో కుల దైవమైన ఉబ్బమ్మకు రజక కులస్తులు పెద్దయెత్తున పొంగళ్లు పెట్టారు.పూలు, పండ్లు, పసుపు కుంకుమలతో కులదైవాన్ని భక్తిశ్రద్ధల మధ్య ముత్తైదువలు కొలుచుకున్నారు.సంప్రదాయబద్ధమైన వాయిద్యాలు, నాట్యాలు, పూనకాల మధ్య రజక కులస్తుల ఉబ్బ దేవర సంప్రదాయబద్ధంగా సాగింది. ఉబ్బమ్మ దేవరకు అభిషేకాలు నిర్వహించి, విశేషాలంకరణలు చేశారు.మధ్యాహ్నం శాకాహార వంటకాలతో, రాత్రి అమ్మవారికి బలులుగా అర్పించిన మాంసాహార వంటకాలతో విందు భోజనాలు సాగాయి.పేదలకు అన్నదానం చేశారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, ద్రావిడ విశ్వవిద్యాలయం వీసీ దొరస్వామి, రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, నాయకులు సత్యేంద్రశేఖర్, డాక్టర్ వెంకటేశ్ తదితర నాయకులు, రజక సంఘం నాయకులు బి.పవన్‌చంద్ర, బి.కణ్ణన్, సీవీ.రవికుమార్, జి.నరసింహులు, ఎస్.దయాకర్, టి.రంగనాథ్ తదితరులు ఈ ఉబ్బ దేవరలో పాల్గొన్నారు.

కారు సహా ఎర్రచందనం దుంగల స్వాధీనం



కారు డిక్కీలో ఎర్రచందనం దుంగలు

కల్లూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కారులో తరలిస్తున్న 8 ఎర్రచందనం దుంగలను పులిచెర్ల మండలంలో మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. పులిచెర్ల మండలం 106 రామిరెడ్డిగారిపల్లి గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు గస్తీ చేపట్టారు. వీరికి గ్రామస్తులు సహకరించారు. వేకువజామున చిన్నగొట్టిగల్లు వైపు నుంచి రెండు ద్విచక్రవాహనాలు రావడాన్ని పోలీసులు గమనించారు. స్థానికులతో కలిసి పోలీసులు ద్విచక్ర వాహనాలను వెంబడించారు. ఓ ద్విచక్రవాహనంలో వెళుతున్న వ్యక్తి పోలీసులను గమనించి వాహనాన్ని వదిలి పారిపోయాడు. ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు స్థానికులతో కలిసి చుట్టుపక్కల వ్యవసాయ పొలాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. పోలీసులకు సహకారం అందించిన మండల జనసేన పార్టీ అధ్యక్షులు చంద్రబాబు మామిడితోటలో ఆగి ఉన్న ఓ కారును గుర్తించారు. పోలీసుల గస్తీని పసిగట్టిన స్మగ్లర్లు కారును మామిడితోటలో వదిలిపెట్టి పారిపోయారు. కారుతోపాటు 215 కిలోల బరువున్న 8 ఎర్రచందనం దుంగలు, ద్విచక్రవాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

తల్లి ఒడికి చేరిన చిన్నారి



నరసింహులు దంపతులకు దీక్షితను అప్పగిస్తున్న తిరుమల పోలీసులు

తిరుమల, మార్చి4 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో కనిపించకుండాపోయిన బాలిక క్షేమంగా తల్లి ఒడికి చేరింది. తిరుమలలో చిరువ్యాపారులుగా ఉన్న విజయవాడకు చెందిన కరుణశ్రీ, నరసింహులు కూతురు నాలుగేళ్ల దీక్షిత ఆస్థానమండపం వద్ద ఆడుకుంటుండగా సోమవారం సాయంత్రం నుంచి కనిపించకుండా పోయింది. వీరు రాత్రి 7.30 గంటల సమయంలో పోలీసులను ఆశ్రయించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించి ఒక మహిళ వెంట పాప తిరుపతికి వెళ్లినట్టు నిర్ధారించుకున్నారు. ఆ మహిళ ధరించిన దుస్తులు ఆధారంగా తిరుమలలోనే పనిచేసే పారిశుధ్య కార్మికురాలుగా గుర్తించారు. వెంటనే తిరుపతిలోని పోలీసులను అప్రమత్తం చేసి బృందాలుగా గాలింపు చర్యలు చేపట్టారు. తిరుపతి పెద్దకాపు లేఅవుట్‌లో రాత్రి 10.30 గంటల సమయంలో చిన్నారితో సహా మహిళను అదుపులోకి తీసుకున్నారు. అర్ధరాత్రి 12.30 గంటలకు పాపను తల్లిదండ్రులకు అప్పగించారు. గంటల వ్యవధిలోనే పాప ఆచూకీ కనిపెట్టిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

నెలాఖరు దాకా సెలవుల్లేవ్

● ఆదివారాలూ ఆఫీసుకు రావాల్సిందే

● రోజూ అదనంగా రెండు గంటల విధులు

● ఖజానా కార్యాలయాల ఉద్యోగుల పరిస్థితి



జిల్లా ఖజానా కార్యాలయం

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఖజానా కార్యాలయాల ఉద్యోగులకు మార్చి నెల వచ్చిందంటే గుండెల్లో దడ ప్రారంభమవుతుంది.దాదాపు 150 మంది ఉద్యోగులకు ఈ నెలంతా సెలవులుండవు. రెండో శనివారం, 14న హోళి, 30న ఉగాది, 31న రంజాన్ సెలవు రోజులైనా విధులకు రావాల్సిందే. ఆర్థిక సంవత్సరాంత మాసమైన మార్చిలో ఖజానా శాఖ 31 రోజులూ పనిచేయాల్సిందే. దీనికి తోడు రోజూ అదనంగా ఉదయం, సాయంత్రం ఒక్కో గంట పాటు ఉద్యోగులు పనిచేస్తున్నారు.ప్రభుత్వ పనివేళలు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల దాకా ఉంటాయి. కానీ ఖజానా ఉద్యోగులు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ నెలాఖరువరకు పనిచేయాలి. జిల్లావ్యాప్తంగా చిత్తూరుజిల్లా ఖజానాతో పాటు చిత్తూరు, బంగారుపాళ్యం, పలమనేరు, పుంగనూరు, కుప్పం, నగరి ఉపఖజానాలన్నీ ఇలాగే పనిచేస్తున్నాయి. ఖజానా డైరెక్టర్ ఫిబ్రవరి నెలాఖరులో ఈ మేరకు సర్క్యులర్ జారీ చేశారు కూడా. ఆర్థికపరమైన, ఆర్థికేతర బిల్లులన్నీ ఈ నెలాఖరులోగా పాసవుతుంటాయి.ఇందుకు సంబంధించిన బిల్లులు రోజూ వస్తుంటాయి. వాటిని ఎప్పటికప్పుడు తనిఖీ చేసి, పాస్ చేస్తూ సీఎఫ్ఎంఎస్‌కు పంపించాల్సివుంటుంది. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా రోజూ విధులకు హాజరౌతున్నారు. మున్ముందు రోజుల్లో అన్ని శాఖలకు సంబంధించి బిల్లుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

పైనేని మునెమ్మ స్మారక కథల పోటీల ఫలితాలు విడుదల

గంగవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పైనేని మునెమ్మ స్మారక కథల పోటీల ఫలితాలను మంగళవారం తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాధం నాయుడు విడుదల చేశారు. తన తల్లి పైనేని మునెమ్మ ఇటీవల మరణించడంతో ఆమె జ్ఞాపకార్థం జాతీయ స్థాయి కథల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో ఆరు రాష్ట్రాల నుంచి మొత్తం 119 కథలు పోటీకి వచ్చాయని, అందులో మొదటి బహుమతికి హైదరాబాదుకు చెందిన రోహిణి రాసిన బ్రహ్మొకటేనా కథ, రెండో బహుమతికి విశాఖపట్టణానికి చెందిన డాక్టర్ ఎం.సుగుణరావు రాసిన జనులాపుత్రిని కనుగొని పొగడగ కథ, మూడో బహుమతికి తమిళనాడులోని తిరుత్తణికి చెందిన ఓట్ర ప్రకాష్‌రావు రాసిన మురుగు కాలువ కథకు ఎంపికయ్యారని తెలిపారు. వీరితోపాటు పలువురికి ప్రోత్సాహక బహుమతులు ప్రకటించారు.

ఆవులనత్తం జల్లీ క్వారీ లీజు సస్పెన్షన్

కుప్పం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం ఆవులనత్తం వద్ద నడుస్తున్న జల్లీ క్వారీ లీజును సస్పెండ్ చేసినట్లు పలమనేరు భూగర్భ గనుల శాఖ పలమనేరు ఏడీఈ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. లీజుదారుడు లీజు నిబంధనలను పూర్తిగా అతిక్రమించినట్లు తాము జరిపిన తనిఖీలలో తేలిందన్నారు. దీంతో లీజును సస్పెండు చేస్తూ జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేశారన్నారు. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు క్వారీలో ఎటువంటి కార్యకలాపాలు కొనసాగగూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు.

ఏందీ గోల?

తిరుమలలో పెరిగిపోతున్న శబ్దకాలుష్యం



శేషాచలం కొండల్లో ఆకుపచ్చని అడవి ఒడిలో ఒదిగినట్టుగా ఉండే చల్లని, ప్రశాంత ప్రదేశం తిరుమల. మంద్రంగా వినిపించే గోవిందలు.. అన్నమయ్య కీర్తనలు.. శ్రీవేంకటేశ్వరుని దర్శనం కోసం వచ్చే భక్తులు ఈ వాతావరణంలో సకల పరుగులనూ మరచి సేదదీరుతారు. అయితే ఈ ప్రశాంతత కొన్నేళ్లుగా భగ్నం అవుతోంది. శబ్ద కాలుష్యం తిరుమల కొండల హద్దులు దాటేస్తోంది. అసాధారణ స్థాయిలో శబ్దకాలుష్యం నమోదవుతోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఉండాల్సిన శబ్దస్థాయి..

యూనివర్సిటీలు, ఆస్పత్రులు, ఆలయాలు వంటి వాటిని సైలెంట్ జోన్లుగా పరిగణిస్తారు. ఈ ప్రదేశాల్లో పగటి పూట 50, రాత్రి వేళలో 40 డెసిబెల్స్ కంటే ఎక్కువగా శబ్దాలు ఉండకూడదు. అనారోగ్యంతో ఉన్నవారికి, విద్యార్థులకు, దేవుడి సన్నిధిలో గడుపుదామని వచ్చిన వారికి శబ్దం ఒక శత్రువు. నివాస ప్రాంతాల్లో పగలు 55, రాత్రి 45 డెసిబెల్స్ దాకా భరించవచ్చు. వాణిజ్య ప్రాంతాల్లో ఇది 65-55 దాకా అనుమతి ఉంటుంది. పారిశ్రామిక వాడల్లో ఇది 75-70 గా ఉంటుంది.

తిరుమలలో ఇలా ఉంది..

గత ఏడాది జనవరి నుంచి డిసెంబరు వరకు రికార్డులను పరిశీలిస్తే తిరుమలలో నగటున పగటి వేళల్లో 60.5, రాత్రి వేళల్లో 59.68 డెసిబెల్స్ వరకు నాయిస్ లెవల్స్ నమోదయ్యాయి. అంటే వాణిజ్య ప్రాంతాల్లో ఉన్నంత శబ్దం తిరుమలలో ఉంటోందన్నమాట. కొన్ని సందర్భాల్లో ఇండస్ట్రియల్ జోన్ స్థాయి శబ్దాలు కూడా తిరుమలలో నమోదయ్యాయి. దీంతో ఆధ్యాత్మిక వాతావరణం దెబ్బతింటోంది. భక్తులు చెవులు మూసుకుని, మొఖం చిట్లించుకుని తిరుగుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.

హారన్ల మోత!

ప్రతిరోజు 7 నుంచి 10 వేల వాహనాలు తిరుమలకు చేరుకుంటున్నాయి. రద్దీరోజులు, విశేష పర్వదినాల్లో వీటి సంఖ్య మరింతగా పెరిగిపోతుంది. వీటిలో ఆర్టీసీ బస్సులు, భక్తుల వాహనాలు, ట్యాక్సీలు, ద్విచక్రవాహనాలు, లారీలు, టీటీడీ అధికారులు కార్లు, ఉద్యోగుల బస్సులు ఉంటాయి. కొవిడ్ తర్వాత దాదాపు 75 శాతం భక్తులు సొంత వాహనాల్లోనే తిరుమలకు చేరుకుంటున్నారు. ఫలితంగా తిరుమలలో విపరీతంగా వాహనాల రద్దీ పెరిగిపోతోంది. ముందుకు కదిలేందుకు హారన్లు మోగిస్తూ శబ్ద కాలుష్యానికి కారణమవుతున్నారు. కాలంచెల్లిన ట్యాక్సీలు, వాహనాల ద్వారా కూడా వాయు, శబ్ద కాలుష్యాలు తిరుమలలో పెరిగిపోతున్నాయి. జన సందడి పెరగడంతో టీటీడీ బ్రాడ్‌కాస్టింగ్‌లో కూడా నాయిస్ లెవల్స్ ఎక్కువగా నమోదు అవుతున్నాయి.

అమ్మ అలక చూడతరమా!

● వైభవంగా ఆదిదంపతుల పల్లకిసేవ



పల్లకీల్లో స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

శ్రీకాళహస్తి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరుడి మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పల్లకి సేవ వైభవంగా జరిగింది. గంగాదేవిని వివాహమాడాడని తెలిసి పరమశివుడిపై అలకబూనిన ఆదిశక్తిని బుజ్జగించేందుకు పరమశివుడు ప్రయత్నించడమే పల్లకి సేవలో ప్రధానాంశం. జ్ఞానప్రసూనాంబ దేవి పల్లకిలో ఆశీనురాలై ఎదురుగా ఉన్న దర్పణంలో భక్తులకు దర్శనమిస్తారు. సౌందర్య లహరి అయిన ఆదిశక్తి అలకలోనూ అద్వితీయమైన తేజస్సుతో భక్తులకు దర్పణంలో దర్శనమిచ్చారు. తొలుత ఆలయంలోని అలంకార మండపంలో ఉత్సవ మూర్తులను విశేష స్వర్ణాభరణాలు, పట్టువస్త్రాలతో అలంకరించి హారతులు సమర్పించారు. అనంతరం వాహన మండపం వద్ద విద్యుత్తు కాంతులతో సిద్ధమైన పల్లకీల్లో ఆశీనులను చేసి పురవీధుల్లో ఊరేగించారు. సకల పరివార దళం ముందు సాగగా స్వామి, అమ్మవార్లు చిద్విలాసులై భక్తులకు దర్శనభాగ్యం కల్పించి కరుణామృతం కురిపించారు. కోలాట నృత్యాలు, డ్రమ్స్ వాయిద్యాలు, కేరళవాయిద్యాలు, బ్యాండు, మంగళ వాయిద్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. శివనామస్మరణతో చతుర్మాడవీధులు మార్మోగాయి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లోనే పల్లకీ సేవ చిట్టచివరి ఊరేగింపుగా నిర్వహిస్తారు. అందుకని స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



పల్లకీలో.. ఎదురుగా దర్పణంలో అమ్మవారి ప్రతిబింబం

నేడు ఏకాంత సేవ

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు ఏకాంత సేవ జరగనుంది. ఆలయంలోని అమ్మవారి సన్నిధిలో ఉన్న పళ్లియర (శయన మందిరం)లో ఈ క్రతువును నిర్వహించనున్నారు. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను వెండి పల్లకిలో ప్రదక్షిణగా తిప్పి శయన మందిరంలో కొలువుదీర్చనున్నారు.

రేపటినుంచి ఆర్జిత సేవలు ప్రారంభం

ముక్కంటి ఆలయంలో స్వామిఅమ్మవార్లకు నిర్వహించే ఆర్జిత సేవలు గురువారం నుంచి తిరిగి ప్రారంభించనున్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఫిబ్రవరి 21 నుంచి ఆలయంలో ఆర్జిత సేవలను రద్దుచేసి ఏకాంతంగా నిర్వహిస్తున్నారు. బుధవారంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి కానున్నాయి. ఈక్రమంలో గురువారం నుంచి యథావిధిగా ఆర్జిత సేవలు తిరిగి అందుబాటులోకి రానున్నాయి.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

కుప్పం ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధికి చర్యలు



ఎన్టీఆర్ స్టేడియాన్ని పరిశీలించిన టీడీపీ నాయకులు

కుప్పం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణంలోని ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణం అభివృద్ధికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోందని టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఎన్టీఆర్ స్టేడియాన్ని మంగళవారం టీడీపీ నాయకులతో కలిసి వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్టేడియం అభివృద్ధికి రూ.22 కోట్లు మంజూరు చేశారన్నారు. అలాగే కుప్పం శ్మశానం అభివృద్ధికి సైతం మరో రూ.10 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సత్యేంద్రశేఖర్, కన్నన్, గోపీనాథ్, మంజునాథ్ పాల్గొన్నారు.

దళితుల శ్మశానాలను పరిరక్షించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీ మునిరత్నం

గంగవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : దళితుల శ్మశానాలను పరిరక్షించడం కోసం ప్రవేశ పెట్టిన జీవో నంబరు 1235 ను సమగ్రంగా అమలు చేయాలని మానవహక్కుల సంఘం జిల్లా నాయకులు డీపీ మునిరత్నం డిమాండ్ చేశారు. పలమనేరులోని ఆ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు గ్రామాల్లో శ్మశాన స్థలాలు లేకపోవడంతో ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జీవో పటిష్టంగా అమలు చేసి దళితులకు శ్మశానాలకు స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పార్థసారథి, సరస్వతి, వరలక్ష్మి, సుమతి, సాంబశివ, రామకృష్ణారెడ్డి, మురళి పాల్గొన్నారు.

జోగిండ్ల దాహార్తి తీరింది



తాగునీటి సరఫరాను ప్రారంభిస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ఉస్సిగానిపల్లె పంచాయతీ జోగిండ్ల గ్రామంలోని తాగునీటి సమస్య ఎట్టకేలకు తీరింది. గ్రామంలో తాగునీటి కోసం గ్రామస్తులు పడుతున్న అవస్థలను పంచాయతీ నేతలు సీఎం చంద్రబాబు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాలతో జిల్లా కలెక్టర్ గ్రామానికి తాగునీటి బోరు, మోటారు, స్టార్టరుతోపాటు పైప్‌లైన్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి రామ్మూర్తి, మాజీ సర్పంచ్ మహాదేవీ, జయశంకర్, టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ అధ్యక్షుడు మణేష్ మంగళవారం గ్రామంలో తాగునీటి బోరును ప్రారంభించారు. సీఎం చంద్రబాబు, కంచర్ల శ్రీకాంత్‌లకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

మృతుల కుటుంబాలకు
టీడీపీ ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం సింగసముద్రం గ్రామానికి చెందిన నాయనప్ప, నారాయణప్ప సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణలు స్థానిక నేతలతో కలిసి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. మృతుల కుటుంబసభ్యులను పరామర్శించి, పార్టీ తరఫున వారికి రూ.5 వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నేతలు రామ్మూర్తి, జయశంకర్, సత్తి, కృష్ణప్ప, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సారా స్వాధీనం.. ఒకరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న సారాతో ఎక్సైజ్ అధికారులు

రామకుప్పం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఎక్సైజ్ సర్కిల్ అధికారులు మంగళవారం రామకుప్పం మండలంలో నిర్వహించిన దాడుల్లో 90 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు. సీఐ నాగరాజు కథనం మేరకు... మంగళవారం సీఐ, ఎస్‌ఐలు తమ సిబ్బందితో రామకుప్పం మండలంలో విస్తృత దాడులు నిర్వహించారు. మండల పరిధి రామాపురంతాండా అటవీ ప్రాంతంతో దాచిన 90 లీటర్ల నాటుసారా కలిగిన 3 క్యాన్లను స్వాధీనం చేసుకున్నారు. నాటుసారాను దాచి ఉంచిన వ్యక్తి రామాపురంతాండాకు చెందిన విజయ్‌కుమార్‌నాయక్‌గా గుర్తించారు. అతడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. దాడుల్లో ఎస్‌ఐ మోహన్‌బాబు, సీఐ సతీష్ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

సోమల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): టెన్త్ విద్యార్థులు ఇష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈవో శివరత్నమ్మ తెలిపారు. మంగళవారం రాత్రి సోమలలోని పదో తరగతి విద్యార్థుల ఇంటి వద్దకు వెళ్లి పిల్లల తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. పరీక్షలు ముగిసే వరకు టీవీలను బంద్ చేయాలని, మొబైళ్లను పిల్లలకు అందుబాటు లో లేకుండా చూడాలని వివరించారు. ఉపాధ్యాయులు తమ పరిధిలో పదో తరగతి విద్యార్థులు ఉంటే వారికి ఎలాంటి సందేహాలున్నా సలహాలు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హరినాథ్, జ్యోతీశ్వరుడు, అరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్‌తోపాటు మూడు ట్రాక్టర్ల స్వాధీనం

పుంగనూరు రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తుండగా దాడులు నిర్వహించి ఎక్స్‌కవేటర్‌తో పాటు మూడు ట్రాక్టర్లను స్వాధనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ మండలంలోని వైసీపీ నాయకులు మంగళం గ్రామానికి చెందిన విజయ్‌కుమార్, నరేశ్, ఎన్‌ఎస్‌పేటకు చెందిన నాగార్జున కలిసి చెరువులు, కాల్వల్లోని ఇసుకను ఎక్స్‌కవేటర్‌తో అక్రమంగా తవ్వి ట్రాక్టర్లతో తరలిస్తున్నట్లు గ్రామస్తుల ఫిర్యాదు చేశారు. దీంతో దాడులు చేసి వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

లక్ష్మీ నరసింహుడికి ప్రత్యేక పూజలు

కల్లూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపేటలో కొలువైన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకృతుడైన లక్ష్మీనరసింహస్వామి భక్తులకు విశేషంగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు అనంతకుమారాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సారా విక్రేతల అరెస్టు



తహసీల్దార్ రమేష్ వద్ద బైండోవర్ చేసిన ఎక్సైజ్‌శాఖ పోలీసులు

పుంగనూరు రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడేవారిపల్లె సమీపంలో మదనపల్లె మండలం వలసపల్లెకు చెందిన గంగాధర్ ద్విచక్రవాహనంలో మంగళవారం నాటుసారా తరలిస్తుండగా అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. ఈడిగపల్లెకు చెందిన కోసూరు సుబ్రహ్మణ్యం నాటు సారా విక్రయిస్తూ పట్టుబడగా అతని వద్ద 8 లీటర్లు సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే పెద్దపంజాణి మండలం గంకొండపాళ్యం గ్రామానికి చెందిన వెంకటాద్రి, వై.సుబ్రహ్మణ్యం, పెద్ద తాండాకు చెందిన రమేష్‌నాయక్, వెంకటరమణ, భాస్కర్, హరిప్రసాద్, నరసింహులు, ఆర్. బోయ కొండప్ప, చంద్రశేఖర్, శంకరప్ప, నాగరాజ, రాజేంద్రలను అదుపులోకి తీసుకుని పెద్దపంజాణి తహసీల్దార్ రమేష్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు.

నేడు గార్మెంట్స్‌పై అవగాహన సదస్సు

వి.కోట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వి.కోటలోని పీఎంఆర్ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో వెలుగు స్వయం సహాయక సంఘ సభ్యులతో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఏపీఎం లావణ్య తెలిపారు. ఈస్ట్‌మెన్ సంస్థచే గార్మెంట్స్ పరిశ్రమలో ఉపాధి కల్పించేందుకు అవగాహన కల్పిస్తారని, స్వయం సహాయక సంఘ సభ్యులు హాజరు కావాలని కోరారు.

కోతుల నియంత్రణకు కార్యాచరణ ప్రణాళిక

జిల్లా అటవీ శాఖాధికారిణి భరణి



రిజర్వు ఫారెస్టులోని దిబ్బరేవుల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో భరణి తదితరులు

కుప్పం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాలపై దాడులు చేస్తున్న కోతులను నియంత్రించడానికి ఒక స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని జిల్లా అటవీ శాఖాధికారిణి భరణి అన్నారు. కుప్పం మండలం కంగుందిలో ఆమె మంగళవారం పర్యటించారు. ఏపీఎస్‌ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం ఆధ్వర్యంలో జరిగిన గ్రామస్తుల సమావేశంలో పాల్గొన్నారు. కోతుల దాడులతో పంటలు నష్టపోతున్నామని, ఇళ్లపై విపరీతంగా దాడి చేసి గాయపరుస్తున్నాయని, కోతుల కారణంగా జీవితాలు ధ్వంసమవుతున్నాయని గ్రామస్తులు ఆమెకు ఫిర్యాదు చేశారు. పీఎస్.మునిరత్నం మాట్లాడుతూ కోతులకు ప్రత్యేకంగా రిజర్వ్ ఫారెస్టులో ఓ సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని, అందులో ఆ జంతువులు ఆహారంగా తీసుకుని పలురకాల పండ్ల మొక్కలు పెంచడంతోపాటు తాగునీటి సదుపాయం కల్పించాలని సూచించారు. అలా చేయడంతోపాటు కోతులు గ్రామాలపైకి రాకుండా సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. దీనిపై స్పందించిన డీఎఫ్‌వో సమాధానం ఇస్తూ కంగుందితో సహా కుప్పం నియోజకవర్గంలోని పలు సరిహద్దు గ్రామాలు అడవులు, కొండల మధ్యలో ఉన్నాయన్నారు. దీంతో సహజంగానే కోతులు అడవుల్లో నుంచి గ్రామాలపై దాడులు చేస్తాయన్నారు. అయినా సరే కోతుల దాడుల నుంచి గ్రామస్తులను, పంటలను రక్షించేందుకు ప్రత్యేకంగా ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని హామీ ఇచ్చారు. ఏనుగుల దాడులతో తీవ్రంగా నష్టపోతున్నామని, పంటలతోపాటు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏనుగుల కట్టడికి చర్యలు తీసుకోవడంతోపాటు నష్టపరిహారాన్ని పెంచాలని కోరారు. దీనిపై డీఎఫ్‌వో మాట్లాడుతూ సోలార్ ఫెన్సింగ్‌తోపాటు కందకాల తవ్వకం ఏనుగుల కట్టడి కోసం తీసుకుంటున్న చర్యలేనన్నారు. ప్రస్తుతం వరి, రాగి వంటి పంటలు నష్టపోతే ఎకరాకు రూ.12 వేలు, మనిషి గాయాలపాలైతే రూ.2 లక్షలు, చనిపోతే రూ.10 లక్షలు ప్రభుత్వం నష్టపరిహారంగా అందిస్తోందని తెలిపారు. గతంలో చెల్లించిన నష్టపరిహారం ఇప్పుడు రెట్టింపు అయ్యిందని చెప్పారు. అయినా గ్రామస్తుల విన్నపాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. అనంతరం కుప్పం మండలం నడిమూరులోని నగర వనాన్ని, దిబ్బరేవులు రిజర్వు పారెస్టులోని జలపాతాన్ని డీఎఫ్‌వో సందర్శించారు. కుప్పంలోని అటవీ శాఖ కార్యాలయంలో రికార్డులు పరిశీలించి అధికారులకు, సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. పలమనేరు సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్, కుప్పం ఎఫ్‌ఆర్‌వో జయశంకర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న విజయ్‌ప్రతాప్‌రెడ్డి

పుంగనూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులోని వసతి గృహాల్లో మౌలిక వసతులపై రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి ఆరా తీశారు. మంగళవారం రాత్రి పట్టణంలోని ఎస్సీ బాలికలు, బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాలను తనిఖీ చేశారు. పిల్లలకు తయారు చేసిన వంటలను పరిశీలించారు. ఎస్సీ హాస్టల్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థికి బహుమతి ఇవ్వాలని రూ.2 వేలు అందించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థులను కోరారు. బుధవారం రేషన్‌షాపులు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. స్థానిక జడ్పీ గెస్ట్‌హౌస్‌లో బస చేశారు. ఆయన వెంట డీఎస్వో శంకరన్, డీఎస్వో డీటీ శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్ రాము, ఆర్‌ఐ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

● గంగవరం: పలమనేరులోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న భోజనం, పరిశుభ్రతను పరిశీలించారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే కఠిన చర్యలు



పుంగనూరులో దుకాణాలను తనిఖీ చేస్తున్న మున్సిపల్ అధికారులు



పలమనేరులో దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

పుంగనూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): దుకాణాల్లో నాణ్యత లేని ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పలు దుకాణాలపై దాడులు చేపట్టారు. నాణ్యత లేని ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న వారికి రూ. 5 వేలు చొప్పున జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యం దెబ్బతినే విధంగా కవర్లు, ఆహార పదార్థాలు విక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మాంసం దుకాణాలు, చిల్లర దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను స్వాధీనం చేసుకుని వాటికి కాల్చివేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకే ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు విక్రయించాలని, లేకుంటే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. దాడుల్లో ఏఈ కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

● గంగవరం: పలమనేరు మున్సిపల్ పరిధిలో ప్లాస్టిక్ వినియోగంపై మున్సిపల్ పరిధిలోని పలు దుకాణాల్లో మంగళవారం అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. హోటళ్లలో కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది మాకుమ్మడిగా దాడులు నిర్వహించి జరిమానాలు విధించారు.

టీబీ నివారణకు ప్రతిఒక్కరూ సహకరించాలి



సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా టీబీ నివారణ అధికారి వెంకటప్రసాద్

గంగవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): టీబీని సమూలంగా నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ సూచించారు. మంగళవారం కొలమాసనపల్లె పీహెచ్‌సీలో డాక్టర్లు, వైద్యసిబ్బందితో టీబీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడువారాల కంటే ఎక్కువగా దగ్గు, రక్తవాంతులు, ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బందులు కలిగినా, రాత్రిపూట విపరీతంగా చెమటలు పట్టడం, ఆకలి లేకపోవడం తదితర లక్షణాలు ఉంటే క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సుధారాణి, సీహెచ్‌వో విజయభారతి, మధులతోపాటు ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



మాట్లాడుతున్న కమిషనర్ రమణారెడ్డి

గంగవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మున్సిపల్ పరిధిలోని గర్భిణులు, బాలింతలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పౌష్టికాహార కిట్‌లను పంపిణీ చేశారు. మంగళవారం పలమనేరు మున్సిపల్ కార్యాలయ సమావేశ భవనంలో ఐసీడీఎస్, ఆరోగ్య కార్యకర్తలతో అంతర్జాతీయ మహిళా దినోత్సవంపై సమీక్షించారు. పౌష్టికాహారం ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో ఇందిరా ప్రియదర్శిని, సూపర్‌వైజర్లు మాధవీలత, నజీమ, ద్రాక్షాయణి, ఖాదర్‌మొహిద్దీన్ బాబా తదితరులు పాల్గొన్నారు.

అన్నెమ్మగారిపల్లెలో
ఏనుగుల మకాం

సోమల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం అన్నెమ్మగారిపల్లె సమీపంలోని కనికెల చెరువు వద్ద ఏనుగులు మకాం వేసినట్లు రైతులు తెలిపారు. రైతులు తమ పొలాల వద్దకు వెళ్లడానికి భయపడుతున్నారు. పొలాల్లో వేరుశనగ పంట సాగు చేశారు. పిందె దశలో వేరుశనగ పంటను రాత్రి వేళ అడవిపందులు ధ్వంసం చేయడంతో కాపాడుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కుప్పంలో పట్టపగలే చోరీ

కుప్పం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని ఓ ఇంట్లో పట్టపగలే చొరబడి బంగారు, వెండి వస్తువులతోపాటు ఎలక్ట్రానిక్ వస్తువులు దోచుకెళ్లారు. బాధితుల కథనం మేరకు .. కుప్పం మున్సిపాలిటీ తంబిగానిపల్లెలో గ్యాస్ గోడౌన్ వెనుక వీధిలో త్యాగరాజు, భారతి దంపతులు నివాసముంటున్నారు. చిరుద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వీరు ఉదయం విధులకు బయలుదేరి వెళ్లి, మళ్లీ సాయంత్రం ఇంటికి తిరిగి వస్తారు. ఈ విషయం కనిపెట్టిన దొంగలు మంగళవారం పట్టపగలు ఎవరూ ఇంట్లో లేని సమయంలో తలుపులు పగులగొట్టి, బెడ్‌రూములోకి వెళ్లి బీరువా తలుపులు సైతం పగులగొట్టారు. అందులోని 120 గ్రాముల బంగారు ఆభరణాలు, 70 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.20 వేల నగదుతోపాటు డెల్ ల్యాప్‌ట్యాప్ చోరీ చేసుకెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చిన త్యాగరాజు, భారతి చోరీ జరిగి ఉండటం గమనించి కన్నీటి పర్యంతమయ్యారు. దీనిపై కుప్పం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సారా తయారీకి బెల్లం విక్రయించకండి



బెల్లం విక్రయించరాదంటూ కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

పుంగనూరు రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నాటు సారా తయారీకి దుకాణదారులు బెల్లం విక్రయించరాదని ఎక్సైజ్‌సీఐ సురేశ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని వ్యాపారులకు కరపత్రాలను అందించి సారా తయారీ దారులకు నల్ల బెల్లం విక్రయించరాదని సూచించారు. బెల్లం విక్రయించినట్లు తెలిసినా, పట్టుబడినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ వ్యాపారస్తుల సంఘ నాయకులు భానుప్రకాష్, అమరావతి సురేష్, రాంకుమార్, సకల రాజేంద్ర, వెంకటేశ్, మల్లిఖార్జున పాల్గొన్నారు.

మామిడిచెట్ల దగ్ధం

సోమల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సోమల - నడింపల్లె మార్గంలోని మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు పక్కన ఉన్న ఎండు గడ్డికి నిప్పు పెట్టారు. ఆ మంటలు సమీపంలోని మామిడి తోటల్లోకి వ్యాపించి పలు మామిడి చెట్లు దగ్ధమయ్యాయి. అలాగే రోడ్డుకు ఇరువైలా నాటిన మొక్కలు కాలిపోయాయి. రైతులకు చెందిన టమోటా ఊత కర్రలు పొలాల వద్ద నిల్వ చేసి ఉండగా కాలిపోవడంతో తీవ్ర నష్టం జరిగింది.

పకడ్బందీగా ఇంటింటి సర్వే



కొలమడుగులో ఇంటింటా సర్వేను పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో కుమార్

శాంతిపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న వర్క్‌ఫ్రం హోం ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో కుమార్ పంచాయతీ సిబ్బందికి సూచించారు. మంగళవారం కొలమడుగులో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట్లో విద్యార్హతలు కలిగిన వారి వివరాలను సేకరించాలన్నారు. ఇంటి వద్ద పనిచేయుటకు అనువైన స్థలం, ఇంటర్నెట్ సదుపాయం తదితర వివరాలను సర్వే సిబ్బందికి ప్రజలు ఇచ్చి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు చర్యలు

శాంతిపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అవసరమైన గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారం కోసం కొత్త బోర్లను ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో కుమార్ తెలిపారు. మంగళవారం రామాపురం, బెండనపల్లె, పోడుచేను గ్రామాల్లో నీటి సమస్య ఉందని గ్రామస్తులు ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శులతో కలిసి గ్రామాలకు వెళ్లి నీటి సమస్యకు గల కారణాలను తెలుసుకొన్నారు. గ్రామస్తులతో మాట్లాడి నీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కొత్త బోరు వేసి మోటారును అమర్చుతామని తెలిపారు. ఏఈ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్తు తీగల చోరీ

సోమల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సోమలకు చెందిన రైతు మారసాని చిన్నికృష్ణ వ్యవసాయ బోరు మోటారుకు అమర్చిన విద్యుత్ కేబుల్ వైర్లు సోమవారం రాత్రి చోరీకి గురయ్యాయి. కొద్దిరోజుల క్రితం బాలాజీ రైస్‌మిల్ సమీపంలో బోరుకు అమర్చిన కేబుల్ వైర్లు దుండగులు చోరీ చేసినట్లు రైతులు తెలిపారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సర్పదోష నివారణ పూజలు



రామకుప్పం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం సర్పదోష నివారణ పూజలు జరిగాయి. ఎన్నడూ లేని విధంగా అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పురోహితులు భక్తులచే సర్పదోష నివారణ పూజలు చేయించారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

చిత్తూరు రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు అన్నారు. మంగళవారం చిత్తూరు రూరల్ మండలంలోని అనంతాపురంలో హెల్మెట్ వాడకంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. హెల్మెట్ ధరించకపోవడం వల్ల ఎక్కువ మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారన్నారు. అనంతరం ఓ ప్రైవేటు కంపెనీ ఆధ్వర్యంలో 250 హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి భారతి, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు రూ.15వేలను ఇవ్వాలి: ఏఐటీయూసీ



చిత్తూరులో నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

చిత్తూరు రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వాహన మిత్ర కింద ఆటోడ్రైవర్లకు రూ.15వేలను ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజు కోరారు. ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గాంధీవిగ్రహం మంగళవారం ఎదుట నిరసన తెలిపారు. జీవో 21, 31ని ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. ఆటోడ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆటోడ్రైవర్ల యూనియన్ నాయకులు విజయ్‌కుమార్, మణి, చంద్ర, ఉమాపతి, నూర్‌బాషా పాల్గొన్నారు.

నగరి: ఆటో యూనియన్ నాయకులతో కలిసి నగరి ఆర్డీవో భవానిశంకరికి ఏఐటీయూసీ నేత కోదండయ్య మంగళవారం వినతిపత్రం అందించారు. వేలన్, శేఖర్, బాషా, విజయ్‌కుమార్, నాగభూషణ్‌రెడ్డి, మణి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆశ కార్యకర్తలు

యాదమరి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుకు ఆశ కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. యాదమరి పీహెచ్‌సీ వద్ద ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆరు నెలల పాటు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, వయోపరిమితి 62 ఏళ్లకు పెంచడంపై చంద్రబాబుకు రుణపడి ఉంటామని చెప్పారు. జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి వల్లేరు అమర్‌నాథ్ నాయుడు, సీహెచ్‌వో లక్ష్మీనారాయణ, వైద్యాధికారి సురేఖ, సూపర్‌వైజర్లు సెల్వరాణి, లక్ష్మీపతి, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు



శ్రీనివాస్‌కు స్వామివారి జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ ఈవో పెంచలకిషోర్

ఐరాల (కాణిపాకం), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని మంగళవారం మాజీ మంత్రి రోజా, ఆలయ వెండి, బంగారు వాకిళ్ల నిర్మాణ దాత గుత్తికొండ శ్రీనివాస్ (యూఎస్‌ఏ) వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయాధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, మాజీ చైర్మన్ మోహన్ రెడ్డి, సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోతంబట్టువాసి మృతి కేసులో ఇద్దరికి రిమాండ్

చిత్తూరు అర్బన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పొలాల్లో పెట్టిన కరెంటు తీగ తగిలి మృతి చెందిన కేసులో ఇద్దరిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సీఐ నెట్టికంఠయ్య తెలిపిన వివరాల మేరకు.. గత నెల 15వ తేదీన పోతంబట్టుకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి కనపడటం లేదని ఆయన కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదేనెల 17వ తేదీ చంద్రశేఖర్‌రెడ్డి నీవానది సమీపంలో శవమై కనిపించాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును ప్రారంభించారు. పంటలను అడవి జంతువుల నుంచి కాపాడటం కోసం ఆ ప్రాంతానికి చెందిన మోహన్‌రెడ్డి, వెంకటేశ్‌రెడ్డి విద్యుత్ తీగలు పెట్టారు. ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగలకు తగులుకుని చంద్రశేఖర్‌రెడ్డి మృతి చెందాడు. ఇది గుర్తించిన వారిద్దరూ శవాన్ని నీవానది సమీపంలో పడేశారు. విచారణలో భాగంగా నిందితులు మంగళవారం వీఆర్వో ఎదుట లొంగిపోగా.. వారిని పోలీసులకు అప్పగించారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు.

ఘనంగా లైన్‌మెన్ దివస్



లైన్‌మెన్ దివస్‌లో పాల్గొన్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో లైన్‌మెన్ దివస్‌ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కొంగారెడ్డి సెక్షన్ ఆఫీస్‌లో చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర కేక్‌కట్ చేసి, ప్రసంగించారు. నాణ్యమైన విద్యుత్ సరఫరాకు లైన్‌మెన్ కారణమన్నారు. టౌన్ డీఈ ప్రసాద్ పాల్గొన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి



రవి మృతదేహం

పెనుమూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పెనుమూరు ఏఏడ బ్యాంకి చెందిన గంగయ్య కుమారుడు కె.రవి(47) మంగళవారం గ్రామ సమీపంలో ఉన్న బావిలో స్నానానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తూ ఆ బావిలోపడి చనిపోయాడు. మృతదేహాన్ని చిత్తూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి వెలుపలకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేశారు.



వన్‌టౌన్ బస్టాప్ వద్ద..



పాత ఎన్టీఆర్ సర్కిల్ వద్ద..



పీసీఆర్ సర్కిల్ వద్ద..

ట్రాఫిక్ సిగ్నల్స్ ట్రయల్ రన్

చిత్తూరు అర్బన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పెరిగిన జనాభా, వాహనాల రాకపోకలను దృష్ట్యా జిల్లా పోలీసుశాఖ మంగళవారం ట్రాఫిక్ సిగ్నల్స్ ట్రయల్ రన్ నిర్వహించింది. గతంలో రెండుసార్లు సిగ్నల్స్ ప్రారంభించినా, సాంకేతిక కారణాల వల్ల అందుబాటులో రాలేదు. ప్రస్తుతం ఎంఎస్ఆర్ సర్కిల్, గాంధీ సర్కిల్, పీసీఆర్ సర్కిల్, పాత ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్ పోలీసులు ఆయా సిగ్నల్స్ వద్ద ఉండి వాహనదారులకు అవగాహన కల్పించారు. సీఐ నిత్యబాబు పర్యవేక్షించారు. కాగా, కిలోమీటరు పరిధిలోనే నాలుగు సిగ్నల్స్ ఏర్పాటుపై వాహనదారులు కొంత అసహనానికి గురయ్యారు.

ప్రతి విద్యార్థీ ఉత్తమ ఫలితాలు సాధించాలి

రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి



49.కొత్తపల్లెమిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న విజయ్‌ప్రతాప్‌రెడ్డి

శ్రీరంగరాజపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి పదో తరగతి విద్యార్థీ ఉత్తమ ఫలితాలు సాధించాలని రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం ఎస్ఆర్ పురం మండలం 49.కొత్తపల్లెమిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను, అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. తహసీల్దార్ లోకనాథం పిళ్లై, సీడీపీవో పద్మాసునంద, ఎంఈవో సబర్మతి, హెచ్ఎం శాంతి, స్కూల్ చైర్మన్, టీచర్లు పాల్గొన్నారు.

పెనుమూరు: జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని చైర్మన్ రుచి చూశారు. అంతకుముందు అట్టవారిపల్లె రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. తహసీల్దారు శ్రావణ్‌కుమార్, ఎంఈవో రాజేంద్రన్, ఐసీడీఎస్ సీడీపీవో వినుతశ్రీ, హెచ్ఎం యామినీ పాల్గొన్నారు.

పూతలపట్టు: ఎర్రచెరువుపల్లె చౌకదుకాణాన్ని, అంగన్వాడీ కేంద్రాన్ని, పూతలపట్టులో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని చైర్మన్ తనిఖీ చేశారు. వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, సీహెచ్‌వో శ్రీనివాసమూర్తి, డాక్టర్ పావని, తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను చైర్మన్ తనిఖీ చేశారు. అంతకుముందు దండువారిపల్లెలోని రేషన్ దుకాణాన్ని పరిశీలించారు. డీఎస్‌వో శంకరన్, సివిల్ సప్లయాస్ డీఎం బాలకృష్ణ, ఎంఈవోలు నాగేశ్వర రావు, రమేష్‌బాబు, ఆర్ఐ మధుసూదన్, ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థినికి నా తరపున రూ.2వేలివ్వండి

నగదును ప్రిన్సిపాల్‌కు అందజేసిన చైర్మన్

గంగాధరనెల్లూరు: బంగారెడ్డిపల్లె వద్ద గల ఉన్న బాలికల గురుకుల పాఠశాలను చైర్మన్ పరిశీలించారు. ఈసారి టెన్త్ పరీక్షల్లో ఉత్తమ మార్కులతో రాణించిన విద్యార్థినికి తన తరపున రూ.2వేలను అందజేయాలని కోరారు. ఈ మేరకు ఆ మొత్తాన్ని ప్రిన్సిపాల్‌కు అందజేశారు. బాలుర హాస్టల్‌కు సమీపంలో ఎస్సీకాలనీ అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. డిప్యూటీ డీఈవో ప్రభాకర్‌రాజు, మహిళా, శిశు సంక్షేమశాఖ పీడీ వెంకటేశ్వరి, చిత్తూరు, తిరుపతి జిల్లాల గురుకుల పాఠశాల కోఆర్డినేటర్ గీత, ఎంఈవోలు కాణిపాకం ఆంజినేయులుశెట్టి, గుణశేఖర్‌రెడ్డి, సీడీపీవో గుండ్లపల్లె వినతశ్రీ, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దమయంతి, డీటీ తులసీరామ్ పాల్గొన్నారు.

వైసీపీ నాయకులకు జైల్లో రోజా పరామర్శ

చిత్తూరు సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా జైలులో ఉన్న నగరికి చెందిన వైసీపీ నాయకులను మాజీ మంత్రి రోజా మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. పోసాని కృష్ణమురళిని ఇబ్బందులకు గురిచేయడమే అరాచక పాలనకు నిదర్శనమని చెప్పారు.

బాడీ బిల్డర్ పోటీలకు ఆర్థికసాయం

నగరి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బాడీబిల్డర్ పోటీలకు నగరి డీఎస్పీ అజీజ్ మంగళవారం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈనెల 30వ తేదీన పళ్లిపట్టులో జరగనున్న పోటీల నిర్వాహకుడైన పుత్తూరుకు చెందిన దినేష్‌కు తమ వంతు సాయాన్ని అందించినట్లు తెలిపారు. డీఎస్పీవెంట సీఐ మహేశ్వర్ ఉన్నారు.

ప్రజారంజకమైన బడ్జెట్ : తెలుగుయువత



వరుణ్ కుమార్

చిత్తూరు సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రూ.3.22 లక్షల కోట్లతో ప్రజారంజకమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి వరుణ్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఇలాంటి బడ్జెట్‌పై వైసీపీ నేతలు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని చెప్పారు. వైసీపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే బడ్జెట్‌పై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. నేతలు సుబ్రి, శంకర్ , ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెనుప్రమాదం



విద్యుత్ లైన్‌పై విరిగి పడిన పొగ గొట్టం

చిత్తూరు రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గిరింపేటలోని వేలూరు-చిత్తూరు రోడ్డు ఆనుకుని ఉన్న అభిరుచి స్వీట్‌స్టాల్ పొగగొట్టం మంగళవారం విరిగి పక్కనున్న విద్యుత్ లైన్‌పై పడింది. పెద్ద శబ్దంతో కూడిన మెరుపులు రావడంతో రోడ్డుపై ఉన్నవారు కేకలు వేస్తూ పరుగులు తీశారు. తీగలు తెగిపడిఉంటే పెనుప్రమాదమే జరిగుండేదని స్థానికులు తెలిపారు. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. చుట్టుపక్కల గంటపాటు విద్యుత్‌కు అంతరాయ ఏర్పడింది. ఆశాఖ అధికారులొచ్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

దెయ్యాలు వేదాలు వల్లించినట్లే..!

● రోజాపై చుడా చైర్‌పర్సన్, తెలుగు మహిళల ఫైర్

చిత్తూరు సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి రోజా మాటలు వింటుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, తెలుగుమహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ నేత పోసాని కృష్ణమురళి.. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను, వారి కుటుంబీకులను, మహిళలను నోటికి వచ్చినట్లు తిడితే.. రోజా ఖండించలేదని పేర్కొన్నారు. ఇపుడు పోసానిని వెనకేసుకు రావడం సిగ్గుచేటన్నారు.

పెనుమూరు: నగరిలో ఛీదరించుకున్నా రోజాకు ఇంకా బుద్ధి రాలేదని తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు కార్జాల అరుణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ హయాంలో పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రశ్నించిన నాయకులపై కేసులు పెట్టించిన సంగతి మర్చిపోయినట్లు ఉందన్నారు.

గుడిపాల: నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని రోజాకు గుడిపాల మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు ఉదయ హితవు పలికారు. అమాయక ప్రజల జీవితాలను పొట్టన పెట్టుకున్న ఘనత వైసీపీ నాయకులకే దక్కుతుందన్నారు. విమర్శలు మానుకోకుంటే మహిళలే తిరగబడతారని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మరొకరికి గాయాలు



శ్రావణ్‌కుమార్ (ఫైల్ ఫొటో)

వెదురుకుప్పం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. కార్వేటినగరం ఏఎస్ఐ మునికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కార్వేటినగరం మండలం ఆలత్తూరుకకు చెందిన ఈశ్వర్ ఆచారి కుమారుడు శ్రావణ్‌కుమార్(25) అదే గ్రామానికి చెందిన తన స్నేహితుడు చెన్నకేశవులు(21)తో కలసి బైక్‌పై సోమవారం రాత్రి పళ్లిపట్టుకు వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిలోని కొల్లాగుంట చెక్‌పోస్టు వద్దకొచ్చేసరికి వెనుక నుంచి మరో బైక్ వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రావణ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. చెన్నకేశవులుకు గాయాలవడంతో చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.


ఆరు నెలల కిందటే వివాహం: శ్రావణ్‌కుమార్‌కి స్వగ్రామానికి చెందిన ఓ యువతితో ఆరు నెలల క్రితమే వివాహం జరిగింది. రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో ఆ రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది.

పేడదిబ్బలను తొలగించండి: ఈవోపీఆర్డీ

పూతలపట్టు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కమ్మగుట్టపల్లె పంచాయతీ పరిధిలోని పేటపల్లె గ్రామాన్ని మంగళవారం ఈవోపీఆర్డీ శ్రీనివాసులు తమ సిబ్బందితో కలసి సందర్శించారు. గ్రామం మధ్యలో ఉన్న పేడదిబ్బలను చూసి ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మధ్యాహ్నంలోగా పేడదిబ్బలను స్వచ్ఛందంగా తొలగించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


ఫ్యాక్టరీ వ్యర్థపు నీటినుంచి మమ్మల్ని కాపాడండి

జంగాలపల్లె గ్రామస్తుల మొర



పైపులైన్‌ను తొలగిస్తున్న అధికారులు

శ్రీరంగరాజపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వెట్ బై నేచర్ ప్రోడక్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థపు నీటి నుంచి తమను కాపాడాలని జంగాలపల్లె గ్రామస్తులు మొరపెట్టుకుంటున్నారు. పరిశ్రమ నుంచి వ్యర్థపు నీటిని సాగునీటి కాలువలోకి వదలడంతో స్థానికులకు శ్వాసకోస, చర్మ వ్యాధులు వస్తున్నాయని వాపోయారు. కలుషితమైన నీటిని తాగిన ఆవులు, మేకలు చనిపోతున్నాయని చెప్పారు. కాలువలో ఉండే చేపలు కూడా చనిపోయాయన్నారు. ఈ సమాచారం తెలుసుకున్న రెవెన్యూ, పంచాయతీ అధికారులు మంగళవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఫ్యాక్టరీ నుంచి కాలువలోకి ఉన్న పైపులైన్‌ను తొలగించారు. ఫ్యాక్టరీ యాజమాన్యానికి నోటీసులు ఇచ్చారు. సాగునీటి కాలువలో వ్యర్థపు నీరు వదిలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



వ్యర్థపు నీరు కలవడంతో చనిపోయిన చేపలు

జ్వరాలపై ఇంటింటి సర్వే చేయాలి

పాలసముద్రం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా ఇంటింటికీ వెళ్లి డెంగీ, మలేరియా జ్వరాలపై సర్వే నిర్వహించాలని ఆశవర్కర్లను డాక్టర్ మోహన్‌కృష్ణ ఆదేశించారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆశ వర్కర్లతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

48 గంటల్లో బోరు మంజూరు



బోరు వేసేముందు పూజలు చేసిన చెన్నకేశవులు నాయుడు

గుడిపాల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ముట్టుకూరుపల్లె గ్రామంలో తాగునీటి బోరు కావాలని సర్పంచ్ హరిణి, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడులు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ దృష్టికి తీసుకెళ్లగా, తక్షణమే మంజూరు చేశారు. మంగళవారం ఎమ్మెల్యే తండ్రి చెన్నకేశవులు నాయుడు చేతులమీదుగా బోరువేసేందుకు పూజా కార్యక్రమాన్ని చేపట్టారు. నీరు పుష్కలంగా రావడంతో గ్రామానికి తాగునీటి సమస్య తీరిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సంక్షిప్తంగా..

చేతిపంపుల పరిశీలన

విజయపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఇళ్లత్తూరులోని మోటర్లు, చేతిపంపులను మంగళవారం ఎంపీడీవో రాజేంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ హరిప్రసాద్ పరిశీలించారు. వేసవి దృష్ట్యా ఈ పరిశీలన చేపట్టినట్లు తెలిపారు. టీడీపీ సీనియర్ నేత ముని భాస్కర్‌రాజు, ఏకుమలై పాల్గొన్నారు.

60 మద్యం బాటిళ్ల స్వాధీనం

విజయపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పన్నూరు సబ్‌స్టేషన్ సమీపంలో ఎల్లసముద్రం వద్ద అక్రమంగా తరలిస్తున్న 60 క్వార్టర్ మద్యం బాటిళ్లను మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని తరలిస్తున్న శివయ్యను కోర్టులో హాజరుపరచినట్లు ఎస్ఐ బలరాం తెలిపారు.

ఎనిమిది ఇసుక ట్రాక్టర్ల సీజ్



నగరి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఎనిమిది ట్రాక్టర్లను నగరి డీఎస్పీ అజీజ్ మంగళవారం ఉదయం 8గంటలకు సీజ్ చేశారు. ట్రాక్టర్ల యజమానులకు గతంలో సమావేశం నిర్వహించి ఉదయం 9గంటలకుపైన, సాయంత్రం ఐదు గంటల్లోపు మాత్రమే ఇసుక రవాణా చేసుకోవచ్చని తెలిపినా పట్టించుకోకపోవడంతో సీజ్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన

నగరి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు పుత్తూరు వెంకటపెరుమాళ్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం కమ్యూనికేషన్, సాఫ్ట్‌స్కిల్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ వేణుగోపాల్, అధ్యాపకులు డాక్టర్ దేవరాజులురెడ్డి, ఎం.రేవతి, ఎం.పంకజం తదితరులు పాల్గొన్నారు.

బంగారమ్మకు పూజలు

వెదురుకుప్పం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని గ్రామ దేవత బంగారమ్మకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త కొప్పేటి ప్రసాద్ పర్యవేక్షించారు.

గణపయ్యకు అభిషేకం

యాదమరి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు గ్రామంలోని విఘ్నేశ్వరాలయం పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం స్వామికి అభిషేకం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనగా, ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

సారా తయారీ మానుకోండి



స్థానికులకు సూచనలిస్తున్న శ్రీనివాస్

పాలసముద్రం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సారా తయారీ, అమ్మకాలను మానుకోవాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ కోరారు. మంగళవారం నరసింహాపురం పంచాయతీ అయ్యవారి కండ్రిగలో స్థానికులతో సమావేశమయ్యారు. సారా తయారు చేస్తే జైలు పాలవడం ఖాయమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్వేటినగరం ఎక్సైజ్ సీఐ శిరీషాదేవి, సీఐ హనుమంతప్ప, ఎస్ఐలు శ్రావణి, మోసస్, వీఆర్వో రమేష్ నాయుడు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి

గంగాధరనెల్లూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వింజం పంచాయతీ ఆవలాపురం ముస్లిం కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త డి.మునీర్ బాషా కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం మరణించారు. కాగా, 20 రోజులు కిందట ఆయన తల్లి దౌలత్‌బీ అనారోగ్యం కారణంగానే మరణించారు.

విద్యుత్తు తీగల చోరీ

సోమల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సోమలకు చెందిన రైతు మారసాని చిన్నికృష్ణ వ్యవసాయ బోరు మోటారుకు అమర్చిన విద్యుత్ కేబుల్ వైర్లు సోమవారం రాత్రి చోరీకి గురయ్యాయి. కొద్దిరోజుల కిందట బాలాజీ రైస్ మిల్ సమీపంలో బోరుకు అమర్చిన కేబుల్ వైర్లు దుండగులు చోరీ చేసినట్లు రైతులు తెలిపారు.